aruhi
aruhi group
BBTV
BBTV TELUGU

www.mahaaprabha.com

నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

ఆదివారం
18-10-2026 సంపుటి : 01 సంచిక : 207 పేజీలు : 08 వెల : ₹ 5/-

BESQATI
www.besqati.com
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA. తెలంగాణ NAMASTEY MAHAAPRABHA TGTEL/26/A0738 mahaaprabha.com Email : info@mahaaprabha.com

పాక్‌లో భూకంపం..

- ం పాకిస్తాన్‌లో 5.8 తీవ్రతతో భూకంపం
- ం భారత్‌లోని కొన్ని ప్రాంతాల్లోనూ ప్రభావం
- ం సిమ్లా సమీపంలో 4.1 తీవ్రతతో ప్రకంపనలు
- ం తెల్లవారుజామున కొన్ని సెకన్ల పాటు కదిలిన భూమి
- ం రాంపూర్ ప్రాంతంలో భూకంప కేంద్రం గుర్తింపు
- ం భూమికి 10 కిలోమీటర్ల లోతులో కేంద్రం
- ం ప్రాణ, ఆస్తి నష్టం లేదని అధికారుల వెల్లడి
- ం మూడేళ్లలో హిమాచల్‌లో 67 భూకంపాలు



వర్షార్పణమైన ఆఖరి టీ20..

- ం చిన్నస్వామి స్టేడియంలో వరుణుడి ఆటంకం
- ం తొలుత 9 ఓవర్లకు కుదింపు.. ఆపై మ్యాచ్ రద్దు
- ం భారత్ స్కోరు 7.4 ఓవర్లలో 118/5
- ం ఇషాన్ కిషన్ మెరుపు ఇన్నింగ్స్.. 10 బంతుల్లో 30 పరుగులు
- ం సంజూ శాంసన్ 7 బంతుల్లో 16 పరుగులు
- ం శ్రేయస్ అయ్యర్ వేగంగా 22 పరుగులు
- ం నమన్ ధీర్ విధ్వంసం.. 6 బంతుల్లోనే 24 పరుగులు
- ం ఐదో టీ20 రద్దుతో 2--2తో ముగిసిన సిరీస్





బస్టాండ్లు కిటకిట!

- ం సొంతూళ్లకు పయనమైన ప్రజలతో జేబీఎస్, ఎంజీబీఎస్ కిక్కిరిసిన వైనం
- ం గంటల తరబడి నిరీక్షణ.. టికెట్ల కోసం ప్రయాణికుల అవస్థలు
- ం పండుగ రద్దీకి 7 వేల ప్రత్యేక బస్సులు నడుపుతున్న టీజీఎస్ఆర్టీసీ
- ం ఉప్పల్, ఎల్బీనగర్, ఆరాంఘర్ నుంచి అదనపు సర్వీసులు
- ం ప్రత్యేక బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం
- ం ప్రైవేట్ ట్రావెల్స్ టికెట్ ధరలు భారీగా పెంచుతున్నాయని ఆరోపణలు
- ం విజయవాడకు రూ.1,400--1,700 వరకు ఏసీ స్లీపర్ ఛార్జీలు
- ం రద్దీ దృష్ట్యా ముందస్తు బుకింగ్ చేసుకోవాలని అధికారుల సూచన

హైదరాబాద్, అక్టోబర్ 17 (మహాప్రభ)
దసరా పండుగ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. ఈ నెల 20న పండుగను కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకునేందుకు నగరవాసులు పల్లెబాట పట్టడంతో జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్), మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) రద్దీగా మారాయి. టికెట్ కౌంటర్లు, ప్లాట్‌ఫామ్‌లు, వెయిటింగ్ హాళ్లలో ప్రయాణికుల సందడి కనిపిస్తోంది. కొన్ని మార్గాల్లో బస్సుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) -మిగతా 3 లో

ఇంటర్నెట్ వినియోగం పిల్లల
ప్రాథమిక హక్కు

పిల్లలను పూర్తిగా దూరం చేయడం సరికాదు

- ం హానికర కంటెంట్‌ను అడ్డుకోవాల్సిన బాధ్యత వేదికలదే
- ం నిషేధంతో సమస్య పరిష్కారం కాదన్న సుప్రీంకోర్టు
- ం మారుమూల పిల్లలకు చదువుకు ఇంటర్నెట్టే ఆధారం
- ం హానికర సమాచారాన్ని తొలగించేందుకు జాతీయ డేటాబేస్
- ం పిల్లల భద్రతకు ప్రత్యేక చర్యలు అవసరం
- ం ఇంటర్నెట్ హక్కుపై ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

పిల్లల భద్రత పేరుతో ఇంటర్నెట్‌కు వారిని పూర్తిగా దూరం చేయడం సరైన పరిష్కారం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పెద్దలతోపాటు పిల్లలకూ ఇంటర్నెట్‌ను వినియోగించే ప్రాథమిక హక్కు ఉందని పేర్కొంది. హానికర కంటెంట్ ఉందనే కారణంతో ఆన్‌లైన్ ప్రపంచానికి వారిని దూరం చేయడం కంటే, అలాంటి సమాచారాన్ని గుర్తించి తొలగించే వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించింది. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లోని పిల్లలకు చదువు, సమాచారం పొందేందుకు ఇంటర్నెట్ ప్రధాన ఆధారంగా ఉంటోందని గుర్తుచేసింది. సామాజిక మాధ్యమాలు సహా వివిధ ఆన్‌లైన్ వేదికల్లో పిల్లలకు హాని కలిగించే కంటెంట్‌ను గుర్తించి తొలగించేందుకు సమగ్ర జాతీయ డేటాబేస్ ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ధర్మాసనం ప్రస్తావించింది.

డైనమిక్ బ్యూరో అక్టోబర్ 17 (మహాప్రభ)
ఇంటర్నెట్‌ను ఉపయోగించడం పెద్దలతో పాటు పిల్లలకూ ప్రాథమిక హక్కేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని 21, 19(1)(ఎ) అధికరణాల ప్రకారం ఈ హక్కు పిల్లలకూ వర్తిస్తుందని పేర్కొంది. పిల్లల భద్రత కోసం వారిని పూర్తిగా ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంచడం సరైన మార్గం కాదని అభిప్రాయపడింది. జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ కె.వి.నోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఇంటర్నెట్‌లో పిల్లలకు హాని కలిగించే సమాచారం ఉంటున్న మాట వాస్తవమేనని కోర్టు పేర్కొంది. అయితే, అలాంటి సమాచారాన్ని గుర్తించి తొలగించడంలో -మిగతా 3 లో





అమెరికా ఒత్తిడికి తలొగ్గం!

- ం అణ్వాయుధాలు తయారు చేస్తున్నామన్న ప్రచారం పచ్చి అబద్ధం
- ం అమెరికా బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్న అధ్యక్షుడు పెజెష్కియాన్
- ం అణ్వాయుధాల అభివృద్ధిని గతంలోనే వ్యతిరేకించిన ఖమేనీ
- ం చర్చలకు ఎప్పుడూ సిద్ధమేనని ఇరాన్ ప్రకటన
- ం అమెరికా ఆంక్షలు మానవతా సూత్రాలకు విరుద్ధమని విమర్శ
- ం అమెరికా, ఇజ్రాయెల్ దాడులు అన్యాయమన్న ఇరాన్ అధ్యక్షుడు
- ం అర్మేనియా, జార్జియా నేతలతో సమావేశాల్లో ఇరాన్ వైఖరి వెల్లడి
- ం బలప్రయోగం మాని చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపు



సీఈసీని తొలగించాలి.. బ్యాలెట్ పద్ధతిని తేవాలి!

- ం సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తొలగింపునకు డీఎంకే తీర్మానం
- ం ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్
- ం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను రద్దు చేయాలని నిర్ణయం
- ం స్టాలిన్ అధ్యక్షతన పార్టీ ఎంపీల సమావేశం
- ం ఎన్నికల ప్రక్రియలో అవకతవకలపై రాష్ట్రపతికి వినతిపత్రం
- ం ఎన్నికల నిర్వహణలో సీఈసీ విఫలమయ్యారని డీఎంకే ఆరోపణ
- ం కాంగ్రెస్, టీవీకే ద్వంద్వ వైఖరిపై విమర్శలు

కేంద్ర ఎన్నికల సంఘం పనితీరు, ఎన్నికల ప్రక్రియపై తమిళనాడు ప్రతిపక్ష పార్టీ డీఎంకే అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని, ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని రద్దు చేయాలని కోరుతూ పార్టీ పార్లమెంటరీ సమావేశంలో నాలుగు తీర్మానాలను ఆమోదించింది. ఎన్నికల సంస్కరణలు చేపట్టాలని రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించింది. ఎంకే స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విద్యార్థి సంఘాల నిరసనలకు మద్దతు తెలపడంతోపాటు, కాంగ్రెస్, టీవీకే పార్టీల వైఖరిని కూడా డీఎంకే ప్రశ్నించింది.



సీఎం రేవంత్ సద్దుల బతుకమ్మ పండగ శుభాకాంక్షలు

- ం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా పూల పండుగ
- ం ఆడబిడ్డల ఆరాధనకు నిలువెత్తు నిదర్శనం
- ం పకృతిని, పూలను పూజించే గొప్ప సంస్కృతి మనది
- ం ఆటపాటలతో ఘనంగా సద్దుల బతుకమ్మ జరుపుకోవాలని పిలుపు
- ం ప్రతి కుటుంబంలో సిరిసంపదలు, సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్ష
- ం మహిళల ఐక్యతను చాటిచెప్పే పండుగగా బతుకమ్మ
- ం ఆడబిడ్డల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: అక్టోబర్ 17 (మహాప్రభ)
సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు, ప్రత్యేకించి ఆడబిడ్డలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక అని, ప్రకృతిని, పూలను పూజించే గొప్ప సంస్కృతికి ఈ పండుగ నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో మహిళలు, ఆడబిడ్డలు ఆటపాటలతో -మిగతా 3 లో

సినీ గమ్యస్థానంగా
హైదరాబాద్

భారతీయ సినిమాకు హైదరాబాద్ ప్రధాన కేంద్రం కావాలి!



- ం యువ దర్శకులు సమాజాన్ని ఆలోచింపజేసే చిత్రాలు తీయాలి
- ం బతుకమ్మ సామాజిక న్యాయం, సమానత్వానికి ప్రతీక
- ం వాతావరణ మార్పులు, నీటి సంక్షోభంపై లఘుచిత్రాలు రూపొందించాలి
- ం యువ సినీ ప్రతిభకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది
- ం మూడు నిమిషాల్లో కథ చెప్పడం గొప్ప సృజనాత్మకత
- ం షార్ట్‌ఫిల్మ్ ఛాలెంజ్‌లో 29 విభాగాల్లో అవార్డులు
- ం బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్ ఛాలెంజ్--2026లో భట్టి విక్రమార్క

హైదరాబాద్, అక్టోబర్ 17 (మహాప్రభ)
యువ దర్శకులు తమ సృజనాత్మకతతో సమాజాన్ని ఆలోచింపజేసే లఘుచిత్రాలు రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి సంక్షోభం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. హైదరాబాద్‌ను కేవలం తెలుగు చిత్ర పరిశ్రమకే పరిమితం చేయకుండా, భారతీయ సినిమాకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో నిర్వహించిన బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్ ఛాలెంజ్ అవార్డ్స్--2026 కార్యక్రమానికి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. -మిగతా 3 లో



ఇది కాలం తెచ్చిన కరువు కాదు..
కాంగ్రెస్ తెచ్చింది:

- ం రేవంత్ సర్కారుపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర విమర్శలు
- ం దేవాదులలో పది మోటార్లకు మూడే ఎందుకు నడుపుతున్నారు?
- ం ఎల్‌నినో ముప్పు తెలిసినా నీటి ఎత్తిపోతల్లో నిర్లక్ష్యమని ఆరోపణ
- ం రిజర్వాయర్లు, చెరువులు నింపడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- ం సమ్మక్క బ్యారేజీతో 300 రోజుల పాటు నీటిని ఎత్తే అవకాశం
- ం ఏపీతో పోలిస్తే తెలంగాణలో వర్షపాతం ఎక్కువైనా కరువెందుకని ప్రశ్న
- ం పట్టిసీమతో ఏపీలో పంటలకు నీరందుతోందని వ్యాఖ్య
- ం రైతుల కష్టాలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ

హైదరాబాద్:అక్టోబర్ 17 (మహాప్రభ)
తెలంగాణలో నెలకొన్న కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. రైతులు, ప్రజల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీటిని డబ్బుతో కొనలేమని ముఖ్యమంత్రే చెబుతున్నప్పుడు, అంతటి కీలకమైన నీటి నిర్వహణపై ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందని ప్రశ్నించారు. ఇది ప్రకృతి తెచ్చిన -మిగతా 3 లో

విద్యార్థుల ఆందోళనతో
అట్టుడికిన ఫ్రాన్స్



అక్కడ కూర్చొని ధర్నా చేస్తాం'..

ఢిల్లీ హైకోర్టు సమీపంలో రోడ్డు పనుల్లో జాప్యంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు



న్యూఢిల్లీ: అక్టోబర్ 17 (మహాప్రభ)
దేశ రాజధానిలోని ఢిల్లీ హైకోర్టు సమీపంలో రహదారి భద్రతకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంలో జాప్యంపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధికారులు తగిన చర్యలు చేపట్టకపోతే హైకోర్టు ప్రధాన ద్వారం వద్ద తామే స్వయంగా కూర్చొని ధర్నా చేస్తామని ధర్మాసనం వ్యాఖ్యానించింది. (ఔఅశ్రీశ్రీ ూఱ్ ూఅ ణష్ట్రుతీఱు) ఢిల్లీ హైకోర్టు సమీపంలోని మధుర రోడ్డు కూడలి వద్ద రహదారి భద్రత, సరైన ట్రాఫిక్ నిర్వహణ లేకపోవడం, పాదచారుల భద్రతా పరమైన సమస్యలపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం దీనిపై విచారణ జరిపింది.కాగా, ఒక కమిటీ ఈ సమస్యను పరిశీలిస్తున్నదని, ఉన్నతాధికారులతో తాను చర్చించానని కేంద్ర ప్రభుత్వం తరుపున అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) సుప్రీంకోర్టుకు తెలిపారు. అయితే ఉన్నత స్థాయి కమిటీ అవసరమేమిటని కోర్టు ప్రశ్నించింది. సమస్యను ఖచ్చితంగా గుర్తించి, పరిష్కారాన్ని కనుగొనేందుకు 'అమికస్ క్యూరీ' (కోర్టుకు సహాయం చేసే వ్యక్తి)ని భాగస్వామిగా చేయాలని సూచించింది. అధికారులు కమిటీ చర్చలకే పరిమితం కాకుండా, తదుపరి విచారణకు ముందే అవసరమైన క్షేత్రస్థాయి పనులను పూర్తి చేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. మరోవైపు గడువులోగా అధికారులు స్పష్టమైన పరిష్కారాన్ని అమలు చేయడంలో విఫలమైతే, ఏఎస్‌జీతో పాటు ప్రధాన కార్యదర్శి కూడా కోర్టుకు హాజరు కావాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు హెచ్చరించింది. నవంబర్ 25లోపు తగిన చర్యలు చేపట్టకపోతే, తామే స్వయంగా హైకోర్టు ప్రధాన ద్వారం వద్ద 'ధర్నా' చేస్తామని పేర్కొంది. 'ఒకవేళ మీరు ఈ పని పూర్తి చేయకపోతే, మేమిద్దరం (సుప్రీంకోర్టు ధర్మాసనంలోని న్యాయమూర్తులు) ఢిల్లీ హైకోర్టు ప్రధాన ద్వారం వద్ద కూర్చుంటాం. పని పూర్తయ్యే వరకు అక్కడి నుంచి మేం కదలబోము, ఇంటికి కూడా వెళ్లము. ఇది ఖాయం. మిమ్మల్ని కూడా ఇంటికి వెళ్లనివ్వం' అని ధర్మాసనం సరదాగా వ్యాఖ్యానించింది. ఢిల్లీలో ప్రస్తుతం వివిధ అంశాలపై అనేక నిరసనలు జరుగుతున్న తరుణంలో, సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్య ప్రాధాన్యత సంతరించుకున్నది.

నితీశ్ కోసం తొమ్మిది హత్యలు చేశా

జేడీయూ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు



పాట్నా: అక్టోబర్ 17 (మహాప్రభ)
బీహార్‌లో జేడీయూ ఎమ్మెల్యే అనంత్‌కుమార్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసి రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టించారు. మాజీ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కోసం తొమ్మిది మంది ప్రాణాలు తీశానని ప్రకటించిన ఆయన కొద్ది సేపటికే యూటర్న్ తీసుకున్నాడు. మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్‌పై ఆ వ్యాఖ్యలు చేసినట్టు పేర్కొన్నాడు. 'నితీశ్ కోసం చేసిన తొమ్మిది హత్యల్లో నేనే సూత్రధారిగా వ్యవహరించాను' అంటూ ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని జేడీయూ పేర్కొంది. రాబోయే శాసనమండలి ఎన్నికల్లో తన రాజకీయ విరోధి నీరజ్ కుమార్‌ను పార్టీ రంగంలోకి దింపడంతో ఆగ్రహంతో ఆయన ఈ ఆరోపణలు చేశాడు.'నితీశ్ కుమార్‌తో నాకు చాలాకాలంగా పరిచయం ఉంది. అతనికి సహాయం చేయడం కోసం నేను తొమ్మిది హత్యలకు కారణమయ్యాను. ఆయన తన స్థానాన్ని నిలబెట్టుకోవడానికి కష్టాలు పడుతున్న సమయంలో ఆయనకు సహాయంగా ఉన్నాను' అని అనంత్‌కుమార్ తెలిపారు. ' తొమ్మిది హత్యలు చేసినట్టు సింగ్ ఒప్పుకున్నాడు. అయితే తర్వాత పార్టీ ఒత్తిడో, కేంద్రం బలవంతం మీదో ఆయన తన ప్రకటనను వాపసుతీసుకోవచ్చు. అంతమాత్రాన కరుడుగట్టిన క్రిమినల్ గ్యాంగులతో అంటకాగుతూ నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా పాలన సాగించిన విషయం నిజం కాకుండా పోతుందా?' అని ఆర్జేడీ నేత శక్తి సింగ్ యాదవ్ ప్రశ్నించారు.

ఆరు నెలల్లోపు పిల్లల ఆహారంలో వీటిని కలుపొద్దు



న్యూఢిల్లీ: అక్టోబర్ 17 (మహాప్రభ)
ఆరు నెలల్లోపు వయసున్న పిల్లలకు సంబంధించిన ఆహార ఉత్పత్తుల్లో ఫ్రక్టోజ్ , సుక్రోజ్ లను కలుపొద్దని 'భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ ' ప్రతిపాదించింది. ఈ మేరకు 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ఫుడ్స్ ఫర్ ఇన్‌ఫాంట్ న్యూట్రిషన్) రెగ్యులేషన్స్ యాక్ట్ 2020' కి సవరణ ముసాయిదాను ప్రచురించింది. పసితనంలోనే అదనపు చక్కెరలు తీసుకోవడాన్ని తగ్గించడం ద్వారా శిశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించడం, పోషకాహార భద్రతను బలోపేతం చేయడమే ఈ ప్రతిపాదనల లక్ష్యమని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ తెలిపింది.బిడ్డ ఎదుగుదలకు మొదటి ఆరు నెలలు ఎంతో కీలకమని, ఈ వయసు వారికి అవసరమైన పోషకాలు అందించేలా సంబంధిత ఆహార ఉత్పత్తుల్లో ఫ్రక్టోజ్, సుక్రోజ్‌లను కలపకుండా చూసేలా ఈ ప్రతిపాదనలను రూపొందించారని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ తెలిపింది. మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలనే ప్రభుత్వ సిఫార్సులను ప్రోత్సహించేందుకూ ఈ చర్యలు తోడ్పడతాయని పేర్కొన్నది. బాల్యంలోనే ఊబకాయం, సంబంధిత ఆరోగ్య సవాళ్లను అరికట్టడం కూడా ఈ ప్రతిపాదనల ఉద్దేశమని వెల్లడించింది. అదేవిధంగా ముసాయిదా ప్రతిపాదనలపై 60 రోజుల్లోపు అభ్యంతరాలను, సూచనలను సమర్పించవచ్చని కేంద్ర ఆరోగ్య, కుటుంబసంక్షేమ శాఖ పేర్కొన్నది.

నిరసన హక్కు నేరమైపోయింది

ప్రభుత్వంపై ప్రజలు విశ్వాసాన్ని కోల్పోయారు

కేంద్రం తీరును ఖండించిన ఎంపీ కపిల్ సిబల్



న్యూఢిల్లీ:అక్టోబర్ 17 (మహాప్రభ)
దేశంలో నిరసన తెలపడం నేరమైపోయిందని.. నిరసన తెలిపే ప్రజల హక్కును సుప్రీంకోర్టు రక్షిస్తుందన్న నమ్మకం తనకు ఉన్నదని రాజ్యసభ స్వతంత్ర ఎంపీ, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ అన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసన స్థలిగా కేంద్రం డీ నోటిఫై చేయడంపై ఆయన ఈ విధంగా స్పందించారు. శనివారం ఆయన ఒక ఆన్‌లైన్ మీడియా సమావేశంలో మాట్లాడారు. తీవ్ర నిరుద్యోగం, ఆర్థిక ఇబ్బందులు, ప్రభుత్వ పెట్టుబడులు తగ్గడం వల్ల ప్రజలు కేంద్ర ప్రభుత్వంపై విశ్వాసాన్ని కోల్పోయారని.. ఈ సర్కార్ ఎంత త్వరగా అధికారం నుంచి దిగిపోతే, దేశానికి అంత మంచిదని వ్యాఖ్యానించారు. యువత చేపట్టిన నిరసనల వల్ల ప్రభుత్వానికి ఏం ప్రమాదం పొంచి ఉందని ప్రశ్నించారు. ఎన్నికల వ్యవస్థలు కేంద్రీకృతం కావడం వల్ల 2024లో ఓటర్ల జాబితాను తారుమారు చేశారని ఆయన ఆరోపించారు.

భారత్‌పై 100 శాతం సుంకాలు నిలిపివేసిన ట్రంప్



వాషింగ్టన్, అక్టోబర్ 17 (మహాప్రభ)
రష్యా నుంచి చమురు, గ్యాస్‌ను కొనుగోలు చేసే భారత్ సహా ఇతర దేశాలపై 100 శాతం సుంకాలను విధించేందుకు వీలు కల్పించే చట్టాలను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శుక్రవారం ఒక కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. అమెరికా ప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన యూఎస్ కాంగ్రెస్‌కు తెలిపారు. సుంకాలు విధించే ఈ బిల్లుకు సెప్టెంబర్ 18న ట్రంప్ ఆమోదం తెలిపి, సంతకం చేసినప్పటికీ సుంకాలు స్వయంచాలకంగా అమలులోకి రాలేదు. ఈ చట్టం అమలుకు ముందు 12 నెలల కాలంలో రష్యా నుంచి అత్యధిక మొత్తంలో ముడిచమురు, న్యాచురల్ గ్యాస్‌ను దిగుమతి చేసుకునే ఐదు దేశాలు చట్టం అమలులోకి వచ్చిన 30 రోజుల తర్వాత కూడా వాటిని దిగుమతి చేసుకుంటే 100 శాతం సుంకాలు విధిస్తామని ప్రతిపాదించారు.

రాంలీలా మైదానంలో నవంబర్ 1న కాంగ్రెస్ పార్టీ ర్యాలీ..

-అనుమతించిన పోలీసులు



న్యూఢిల్లీ: అక్టోబర్ 17 (మహాప్రభ)
ఢిల్లీలోని ప్రతిష్టాత్మక రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ ర్యాలీ చేపట్టనుంది. నవంబర్ 1న ర్యాలీ నిర్వహించనుంది. ఇందుకోసం ఢిల్లీ పోలీసులు కాంగ్రెస్ పార్టీకి అనుమతిపత్రం మంజూరు చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు, సర్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్ష ఇండియా బ్లాక్ కూటమి ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో కూడా ఆందోళనల సరళిపై నిర్ణయం తీసుకున్నారు.దీనిలో భాగంగా ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. ఇదే సమయంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికను ఆందోళనల చేసే ప్రదేశాల నుంచి తొలగించిన సంగతి తెలిసిందే. దీంతో రాంలీలా మైదానంలో ర్యాలీ నిర్వహించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఇందుకోసం అనుమతి కోరుతూ ఢిల్లీ పోలీసులను కాంగ్రెస్ పార్టీ ఆశ్రయించింది. వారి వినతిని పరిశీలించిన పోలీసులు.. నవంబర్ 1న ర్యాలీ నిర్వహించుకునేందుకు అనుమతించారు. శనివారం నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఇచ్చారు. అక్టోబర్ 25 నుంచి నవంబర్ 3 వరకు ఏ రోజైనా ర్యాలీ నిర్వహించుకోవచ్చని కాంగ్రెస్ పార్టీకి సూచించారు. దీంతో నవంబర్ 1న ర్యాలీకి కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. ఈ ర్యాలీ కోసం ఢిల్లీ పోలీసులు నిర్వాహకులతోపాటు ట్రాఫిక్ పోలీసులు, ఇతర వ్యవస్తలతో సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. ట్రాఫిక్ మళ్లించాల్సి ఉంటుంది. శాంతి భద్రతలను కాపాడాలి. ఈ నేపథ్యంలో అన్నీ పరిశీలించిన పోలీసులు.. నిబంధనలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీకి అనుమతించారు. సేవ్ డెమొక్రసీ పేరుతో కాంగ్రెస్ పార్టీ ర్యాలీ చేపట్టే అవకాశం ఉంది. ఈ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నేతలు మాత్రమే పాల్గొంటారా.. లేక ఇండియా బ్లాక్ కూటమి నేతలంతా పాల్గొంటారా అనే అంశంలో స్పష్టత రావాల్సి ఉంది.

కాలువలో పడ్డ టెంపో ట్రావెలర్

రాజస్థాన్‌లో 8 మంది మృతి



భోపాల్:అక్టోబర్ 17 (మహాప్రభ)
మధ్యప్రదేశ్‌లోని బేతుల్ జిల్లాకు చెందిన 8 మంది రాజస్థాన్‌లోని కోటా జిల్లాలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్ వేపై ప్రయాణిస్తున్న టెంపో ట్రావెలర్ రోడ్డు నుంచి పక్కకు జరిగి కాలువలోకి పడిపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మరో 15 మంది గాయపడ్డారు. ఎమర్జెన్సీ సిబ్బంది క్రేన్ల సాయంతో బాధితులను బయటకు తీశారు. బాధితులు శిఖర్ జిల్లాలోని ఖటు శ్యామ్ మందిరాన్ని దర్శించుకొనేందకు వెళుతున్నట్టు తెలిసింది. డ్రైవర్ కునుకు తీయ డం వల్ల ప్రమాదం జరిగి ఉండొచ్చని గాయపడిన అన్నిక తెలిపారు.

భారతీయులకు ట్రంప్ మరో షాక్

-వర్క్ పర్మిట్ పొడిగింపు రద్దు



న్యూయార్క్ అక్టోబర్ 17 (మహాప్రభ)
భారతీయులతో పాటు ప్రపంచ దేశాలకు చెందిన లక్షలాది మందికి అమెరికా మరో షాక్ ఇచ్చింది. దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్న సమయంలో ఉద్యోగం కోల్పోకుండా రక్షణ కల్పిస్తున్న 540 రోజుల ఆటోమేటిక్ వర్క్ పర్మిట్ పొడిగింపు రూల్‌ను రద్దు చేస్తున్నట్టు యూఎస్ సిటిజెన్ షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ ప్రకటించింది. దీంతో హెచ్-4 వీసా కలిగిన జీవిత భాగస్వాములు, హెచ్-1బీ వీసా కలిగిన భారతీయుల భాగస్వాములు ఇబ్బంది పడతారు. వర్క్ పర్మిట్ రద్దు అయితే వారు ఉద్యోగం చేయడానికి వీలుండదు. గతేడాది అక్టోబర్ 30 తర్వాత రెన్యువల్ దరఖాస్తులు సమర్పించిన వారికి ఈ కొత్త నిబంధనలు వర్తిస్తాయి. అయితే ఎఫ్-1 స్టెమ్ విద్యార్థులకు మాత్రం 180 రోజుల ఆటోమేటిక్ పొడిగింపు కొనసాగుతుందని యూఎస్ స్పష్టం చేసింది.

ఐదుగురి ప్రాణం తీసిన నూడుల్స్, టీ!



ముంబై :అక్టోబర్ 17 (మహాప్రభ)
గ్రేటర్ నోయిడాలో ఘోర విషాదం నెలకొంది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి చెందడం తీవ్ర కలకలం రేపుతున్నది. రబూపురా ప్రాంతం నగ్లా శ్రీ పదమ్ గ్రామానికి చెందిన మహేశ్ (37), ఆయన భార్య లలిత (35), వారి పిల్లలు లడ్డూ (11), మిష్టి (7), సాక్షత్ (3) శనివారం ఉదయం మృతిచెందారు. పోలీసులు, వైద్య సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. రాత్రి భోజనంలో ఐదుగురూ నూడుల్స్ తిని తర్వాత టీ తాగారని మహేశ్ తల్లి చెప్పారు. రెండూ కలిపి తీసుకోవడం వల్లే ఫుడ్ పాయిజన్ అయ్యి చనిపోయారేమో అని పోలీసులు అంచనా వేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టంకు పంపించారు. పరీక్షల నివేదికల్లో అసలు కారణాలు ఏంటనేది తెలుస్తుంది.

అద్వానీకి ఛాతీలో ఇన్ఫెక్షన్ దవాఖానలో చేరిక



న్యూఢిల్లీ: అక్టోబర్ 17 (మహాప్రభ)
బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీ(98) ఛాతీలో ఇన్ఫెక్షన్ కారణంగా శుక్రవారం రాత్రి న్యూఢిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో దవాఖానలో చేరారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నదని వైద్యులు తెలిపారు. ఆయనకు అవసరమైన వైద్య పరీక్షలు చేస్తున్నట్టు, ఆయన ఆరోగ్యాన్ని ఒక వైద్యుల బృందం పర్యవేక్షిస్తున్నట్టు దవాఖాన అధికారులు తెలిపారు. వృద్ధ్యాప్య సంబంధిత ఆరోగ్య సమస్యల కారణంగా ఈ సంవత్సరం మే నెలలో అద్వానీ ఇదే దవాఖానలో చికిత్స పొందారు. డిసెంబర్ 2024లోనూ ఆయన కొన్ని రోజులు ఐసీయూలో ఉన్నారు.

పాక్‌లో భూకంపం..

-పాకిస్తాన్‌లో 5.8 తీవ్రతతో భూకంపం
-భారత్‌లోని కొన్ని ప్రాంతాల్లోనూ ప్రభావం
-సిమ్లా సమీపంలో 4.1 తీవ్రతతో ప్రకంపనలు
-తెల్లవారుజామున కొన్ని సెకన్ల పాటు కదిలిన భూమి
-రాంపూర్ ప్రాంతంలో భూకంప కేంద్రం గుర్తింపు
-భూమికి 10 కిలోమీటర్ల లోతులో కేంద్రం
-ప్రాణ, ఆస్తి నష్టం లేదని అధికారుల వెల్లడి
-మూడేళ్లలో హిమాచల్‌లో 67 భూకంపాలు

న్యూఢిల్లీ



పాకిస్తాన్‌లో 5.8 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు సమాచారం. దీని ప్రభావంతో భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లోనూ ప్రకంపనలు నమోదైనట్లు కథనాలు వెలువడ్డాయి. ప్రస్తుతానికి ఈ ఘటన వల్ల ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం లేదు.
మరోవైపు, శనివారం తెల్లవారుజామున హిమాచల్‌ప్రదేశ్‌లోని సిమ్లా సమీపంలో భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.1గా నమోదైంది. రాష్ట్ర రాజధాని సిమ్లాకు సుమారు 130 కిలోమీటర్ల దూరంలోని రాంపూర్ ప్రాంతంలో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. జాతీయ భూకంప శాస్త్ర కేంద్రం వివరాల ప్రకారం.. ఉదయం 4.36 గంటల సమయంలో కొన్ని సెకన్ల పాటు భూమి కంపించింది. భూకంప కేంద్రం భూమికి 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు గుర్తించారు.ఈ ప్రకంపనల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ వెల్లడించింది. కొండ ప్రాంతమైన హిమాచల్‌లో తరచూ భూకంపాలు సంభవిస్తుండటంతో స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గత ఆగస్టు 26న కూడా సిమ్లాలో స్వల్ప ప్రకంపనలు నమోదయ్యాయి. అధికారిక సమాచారం ప్రకారం.. గత మూడేళ్లలో హిమాచల్‌ప్రదేశ్‌లో 67 భూకంపాలు సంభవించాయి. వీటి కారణంగా సుమారు రూ.7.05 లక్షల మేర ప్రైవేటు ఆస్తులకు నష్టం వాటిల్లినట్లు నివేదికలు పేర్కొన్నాయి.

వర్షార్పణమైన ఆఖరి టీ20..

-చిన్నస్వామి స్టేడియంలో వరుణుడి ఆటంకం
-తొలుత 9 ఓవర్లకు కుదింపు.. ఆపై మ్యాచ్ రద్దు
-భారత్ స్కోరు 7.4 ఓవర్లలో 118/5
-ఇషాన్ కిషన్ మెరుపు ఇన్నింగ్స్.. 10 బంతుల్లో 30 పరుగులు
-సంజూ శాంసన్ 7 బంతుల్లో 16 పరుగులు
-శ్రేయస్ అయ్యర్ వేగంగా 22 పరుగులు
-నమన్ ధీర్ విధ్వంసం.. 6 బంతుల్లోనే 24 పరుగులు
-ఐదో టీ20 రద్దుతో 2--2తో ముగిసిన సిరీస్

బెంగళూరు:



భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య చిన్నస్వామి స్టేడియంలో జరగాల్సిన ఐదో టీ20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. తొలుత వర్షం అంతరాయంతో మ్యాచ్‌ను 9 ఓవర్లకు కుదించినప్పటికీ, భారత ఇన్నింగ్స్ కొనసాగుతున్న సమయంలో మరోసారి వాన పడింది. ఎంతకీ వర్షం తగ్గకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2--2తో సమమైంది. షెడ్యూల్ ప్రకారం రాత్రి 7 గంటలకు ప్రారంభం కావాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా ఆలస్యమైంది. టాస్ గెలిచిన వెస్టిండీస్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్‌తో భారత వెటరన్ పేసర్ భువనేశ్వర్ కుమార్ దాదాపు నాలుగేళ్ల తర్వాత భారత తుది జట్టులోకి తిరిగి వచ్చినట్లు సమాచారం. తక్కువ ఓవర్ల మ్యాచ్‌లో భారత్ బ్యాటర్లు ఆరంభం నుంచే దూకుడుగా ఆడారు. ఓపెనర్ అభిషేక్ శర్మ 4 బంతుల్లో 6 పరుగులు చేసి ఔటయ్యాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 10 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 30 పరుగులు సాధించాడు. సంజూ శాంసన్ 7 బంతుల్లో 16 పరుగులు చేయగా, శ్రేయస్ అయ్యర్ 14 బంతుల్లో 22 పరుగులు చేశాడు. నమన్ ధీర్ కూడా మెరుపు బ్యాటింగ్‌తో అలరించాడు. తాను ఎదుర్కొన్న తొలి బంతినే సిక్సర్‌గా మలిచిన అతడు, ఆ తర్వాతా భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. వర్షం కారణంగా ఆట నిలిచిపోయే సమయానికి 6 బంతుల్లో 3 సిక్సర్లు, ఒక ఫోర్‌తో 24 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అప్పటికి భారత్ 7.4 ఓవర్లలో 5 వికెట్లకు 118 పరుగులు చేసింది. అయితే వాన తగ్గకపోవడంతో మ్యాచ్ కొనసాగించే అవకాశం లేకపోయింది. ఫలితం తేలకుండానే ఆఖరి టీ20 ముగియడంతో ఇరు జట్లు సిరీస్‌ను సమంగా పంచుకున్నాయి.

బస్టాండ్లు కిటకిట!

మొదటి తరువాయి



సుమారు 7 వేల ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ప్రధాన బస్టాండ్లతోపాటు ఉప్పల్, ఆరాంఘర్, ఎల్బీనగర్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి ప్రాంతాల నుంచి కూడా ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసింది. ప్రత్యేక బస్సుల్లోనూ మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నారు. అయినప్పటికీ కొన్ని మార్గాల్లో టికెట్ల కొరత, బస్సుల కోసం నిరీక్షణ తప్పడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు.
మరోవైపు పండుగ రద్దీని ఆసరాగా చేసుకుని ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణ రోజుల్లో విజయవాడకు ఏసీ స్లీపర్ టికెట్ ధర రూ.600 నుంచి రూ.700 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.1,400 నుంచి రూ.1,700 వరకు అడుగుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. హైదరాబాద్ నుంచి సూర్యాపేటకు సాధారణంగా రూ.200 ఉండే ఛార్జీ ప్రస్తుతం రూ.400 దాటిందని చెబుతున్నారు. విశాఖపట్నం, కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్ మార్గాల్లోనూ ధరలు పెరిగినట్లు ఆరోపిస్తున్నారు.
నగరంలోని మియాపూర్ నుంచి బాలానగర్ వై జంక్షన్ వరకు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆదివారం, సోమవారాల్లో ప్రయాణికుల రద్దీ మరింత పెరిగే అవకాశముండటంతో అధికారులు ఏర్పాట్లపై దృష్టి సారించారు. పండుగ సెలవులు ముగిసిన తర్వాత తిరుగు ప్రయాణాల్లోనూ రద్దీ పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రయాణికులు వీలైనంత ముందుగా టికెట్లు బుక్ చేసుకోవాలని, ప్రైవేట్ ట్రావెల్స్ అధిక ఛార్జీలు వసూలు చేస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

అమెరికా ఒత్తిడికి తలొగ్గం!

-అణ్వాయుధాలు తయారు చేస్తున్నామన్న ప్రచారం పచ్చి అబద్ధం
-అమెరికా బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్న అధ్యక్షుడు పెజెష్కియాన్
-అణ్వాయుధాల అభివృద్ధిని గతంలోనే వ్యతిరేకించిన ఖమేనీ
-చర్చలకు ఎప్పుడూ సిద్ధమేనని ఇరాన్ ప్రకటన
-అమెరికా ఆంక్షలు మానవతా సూత్రాలకు విరుద్ధమని విమర్శ
-అమెరికా, ఇజ్రాయెల్ దాడులు అన్యాయమన్న ఇరాన్ అధ్యక్షుడు
-అర్మేనియా, జార్జియా నేతలతో సమావేశాల్లో ఇరాన్ వైఖరి వెల్లడి
-బలప్రయోగం మాని చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపు



యెరెవాన్

తాము అణ్వాయుధాలను తయారు చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ స్పష్టం చేశారు. ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా, ఎన్ని బెదిరింపులకు పాల్పడినా అమెరికా ఒత్తిడికి తలొగ్గబోమని తేల్చిచెప్పారు. అణ్వాయుధాల అంశంపై ఇరాన్ వైఖరిలో మార్పు లేదని పేర్కొన్నారు. జీవవైవిధ్య సదస్సు సందర్భంగా అర్మేనియా రాజధాని యెరెవాన్‌లో జార్జియా ప్రధాని ఇరాక్లీ కొబాఖిడ్జేతో జరిగిన సమావేశంలో పెజెష్కియాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. అణ్వాయుధాల అభివృద్ధిని నిషేధిస్తూ ఇరాన్ మాజీ సుప్రీం నేత అలీ ఖమేనీ గతంలో స్పష్టమైన వైఖరి తీసుకున్నారని గుర్తుచేశారు. తమ దేశం చర్చలకు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుందని, అయితే బలవంతపు చర్యలకు అంగీకరించబోమని చెప్పారు. అమెరికా విధిస్తున్న ఆంక్షలు మానవతా సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని పెజెష్కియాన్ విమర్శించారు. ఇరాన్‌పై ఇటీవల అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడులను అన్యాయమైన, అమానవీయ చర్యలుగా అభివర్ణించారు. ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యాన్ని తాము వ్యతిరేకిస్తామని జార్జియా ప్రధాని కొబాఖిడ్జే ఈ సందర్భంగా పేర్కొన్నారు. అర్మేనియా ప్రధాని నికోల్ పషినాన్‌తో జరిగిన మరో సమావేశంలోనూ పెజెష్కియాన్ అమెరికా విధానాలపై విమర్శలు చేశారు. ఇరాన్ లొంగిపోదనే వాస్తవాన్ని వాషింగ్టన్ గుర్తించాలని అన్నారు. అమెరికా ఆంక్షలు ఇరాన్‌తోపాటు ఇతర దేశాలకూ సమస్యలు సృష్టిస్తున్నాయని పేర్కొన్నారు. ఇదే విధానాన్ని కొనసాగిస్తే ప్రపంచవ్యాప్తంగా పరిస్థితులు మరింత దిగజారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బలప్రయోగానికి బదులుగా తర్కబద్ధమైన చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని అమెరికాకు పిలుపునిచ్చారు.

సీఎం రేవంత్ సద్దుల బతుకమ్మ పండగ శుభాకాంక్షలు

మొదటి తరువాయి

సద్దుల బతుకమ్మ సంబురాలను ఘనంగా జరుపుకోవాలని సీఎం ఆకాంక్షించారు. ఈ పూల పండుగ ప్రతి ఇంటా ఆనందాల వాన కురిపించాలని, ప్రతి కుటుంబంలో సిరిసంపదలు, సుఖశాంతులు వెల్లివిరియాలని కోరుకున్నారు. తెలంగాణ సంస్కృతి వైభవం తరతరాల పాటు కొనసాగాలని అభిలషించారు.
బతుకమ్మ పండుగ రాష్ట్ర ప్రజల సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పడంతో పాటు మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అనేక సామాజిక అంశాలతో ముడిపడిన ఈ పండుగను రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది రోజుల పాటు వైభవంగా నిర్వహించుకోవడం ఆనందదాయకమని అన్నారు. ఆడబిడ్డల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తూ ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

సినీ గమ్యస్థానంగా హైదరాబాద్

మొదటి తరువాయి



ఈ సందర్భంగా మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ ఆత్మకు ప్రతిరూపమని పేర్కొన్నారు. వివిధ రంగులు, సువాసనలతో కూడిన పూలు ఒకచోట చేరినట్లుగా, సమాజంలోని భిన్న వర్గాల ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చే పండుగ బతుకమ్మ అని వివరించారు. ఇది సామాజిక న్యాయం, సమానత్వం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. తెలంగాణలో ప్రతిభావంతులైన యువ దర్శకులు, నటులు, నిర్మాతలకు మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. యువతలోని సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహిస్తే జాతీయ స్థాయిలో రాణించే కళాకారులు మరింత మంది వెలుగులోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహా రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌ను ప్రముఖ సినీ గమ్యస్థానంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందని తెలిపారు. మూడు గంటల సినిమాలో చెప్పగలిగే కథను రెండు, మూడు నిమిషాల లఘుచిత్రంలో చెప్పడం ఎంతో సృజనాత్మకతతో కూడుకున్నదని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తక్కువ సమయంలోనే ప్రేక్షకులను ఆకట్టుకుంటూ తమ ఆలోచనలను సమర్థంగా వ్యక్తపరిచే యువ దర్శకులకు మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. అవార్డులు రానంత మాత్రాన నిరాశ చెందవద్దని, సృజనాత్మకతను కొనసాగిస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లఘుచిత్రాలు, పాటలు, జానపద గీతాలు, స్ఫూర్తిదాయక కథలు, వ్యాసాలు తదితర విభాగాల్లో మొత్తం 29 అవార్డులతో యువ ప్రతిభను గుర్తించడం అభినందనీయమని పేర్కొన్నారు.
సినిమా కేవలం వినోదానికే పరిమితం కాకుండా ప్రజలకు ఉపయోగపడే సందేశాలను అందించే సాధనంగా మారాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావాలు, ఉష్ణోగ్రతల పెరుగుదల, వర్షపాతంలో మార్పులపై ప్రజలను అప్రమత్తం చేయడానికి యువ దర్శకులు ముందుకు రావాలని కోరారు. నీటి పొదుపు, వర్షపు నీటి సంరక్షణ, ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత వంటి అంశాలను కథాంశాలుగా తీసుకుని లఘుచిత్రాలు రూపొందించాలని అన్నారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగం, భవిష్యత్తు అవసరాలపై కూడా అవగాహన కల్పించే చిత్రాలు సమాజంలో సానుకూల మార్పునకు దోహదపడతాయని పేర్కొన్నారు.
కళలు, సృజనాత్మకతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. యువతలోని ప్రతిభను గుర్తించి తగిన అవకాశాలు కల్పించడం ద్వారా తెలంగాణ నుంచి జాతీయ, అంతర్జాతీయ

ఇంటర్నెట్ వినియోగం పిల్లల ప్రాథమిక హక్కు

మొదటి తరువాయి



ఆన్‌లైన్ వేదికలు విఫలమవుతున్నాయనే కారణంతో పిల్లలకు ఇంటర్నెట్‌ను నిరాకరించలేమని తెలిపింది. నిషేధం విధించినా పిల్లలు ఇంటర్నెట్ వినియోగాన్ని పూర్తిగా ఆపరని, నియంత్రణ లేని ఇతర వెబ్‌సైట్ల వైపు వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లోని పిల్లలకు చదువు, సమాచారం పొందేందుకు ఇంటర్నెట్ ప్రధాన ఆధారంగా ఉంటోందని ధర్మాసనం గుర్తుచేసింది. అందువల్ల పిల్లలను ఆన్‌లైన్ ప్రపంచానికి దూరం చేయడం కంటే, వారిని ప్రమాదాల నుంచి రక్షించే చర్యలు తీసుకోవడం అవసరమని పేర్కొంది. సామాజిక మాధ్యమాలు సహా వివిధ ఆన్‌లైన్ వేదికల్లో హానికర సమాచారాన్ని గుర్తించి తొలగించేందుకు సమగ్ర జాతీయ డేటాబేస్‌ను రూపొందించాలని సూచించింది.

సీఈసీని తొలగించాలి.. బ్యాలెట్ పద్ధతిని తేవాలి!

చెన్నై



కేంద్ర ఎన్నికల సంఘం, ఎన్నికల నిర్వహణ తీరుపై తమిళనాడులోని ప్రతిపక్ష డీఎంకే అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) స్థానంలో తిరిగి బ్యాలెట్ విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తిగా రద్దు చేయాలని కోరుతూ తీర్మానాలు ఆమోదించింది.
శనివారం ఉదయం 11 గంటలకు చెన్నైలోని పార్టీ ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో డీఎంకే అధినేత, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన పార్టీ పార్లమెంటరీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ భేటీలో ఎన్నికల సంస్కరణలు, ఎన్నికల సంఘం పనితీరు తదితర అంశాలపై చర్చించి నాలుగు తీర్మానాలను ఆమోదించినట్లు పార్టీ వెల్లడించింది.
ఎన్నికల నిర్వహణలో సీఈసీ విఫలమయ్యారని ఆరోపిస్తూ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని తొలి తీర్మానంలో డిమాండ్ చేసింది. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని పేర్కొన్న పార్టీ.. వాటిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించింది. అయితే అవకతవకలకు సంబంధించిన నిర్దిష్ట వివరాలను పార్టీ ప్రకటనలో వెల్లడించలేదు. రాష్ట్రపతికి అందించే వినతిపత్రంలో వాటిని వివరించే అవకాశం ఉందని సమాచారం.
విద్యార్థి సంఘాలు నిర్వహిస్తున్న నిరసనలకు మద్దతు తెలుపుతూ మరో తీర్మానాన్ని ఆమోదించింది. కాంగ్రెస్, అధికార టీవీకే పార్టీల ద్వంద్వ వైఖరిని ఖండిస్తూ ఇంకో తీర్మానం చేసింది. అయితే ఈ అంశాల్లో ఆయా పార్టీలు అనుసరిస్తున్న వైఖరికి సంబంధించిన వివరాలను డీఎంకే ప్రకటనలో స్పష్టంగా పేర్కొనలేదు. ఎన్నికల ప్రక్రియలో సంస్కరణలు తీసుకురావాలని రాష్ట్రపతిని కోరుతూ నాలుగో తీర్మానం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

విద్యార్థుల ఆందోళనతో అట్టుడికిన ఫ్రాన్స్

పారిస్



విద్యార్థుల ఆందోళనలతో ఫ్రాన్స్ మరోసారి అట్టుడికింది. విద్యావ్యవస్థలో సంస్కరణలు తేవాలని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేస్తూ గత కొన్ని రోజులుగా విద్యార్థులు చేస్తున్న ఆందోళన విధ్వంసానికి దారితీసింది. పారిస్‌లో ఒక కారు, దుకాణానికి నిప్పంటించారు. హుడీలు, మాస్క్‌లు ధరించి పోలీసులపై బాణసంచా, ఇతర వస్తువులను విసురుతున్న ఆందోళనకారులను చెదరగొట్టడానికి పోలీసులు టియర్ గ్యాస్, జల గోళాలను ప్రయోగించారు. దేశంలోని పలు ప్రధాన నగరాల్లో కూడా పెరుగుతున్న జీవన వ్యయాలకు నిరసనగా, విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా పౌరులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చింది:

మొదటి తరువాయి

కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువని వ్యాఖ్యానించారు.
దేవాదుల ఎత్తిపోతల పథకంలో పది మోటార్లు నడపాల్సి ఉండగా, కేవలం మూడింటినే ఎందుకు నడుపుతున్నారని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని తెలిసినప్పటికీ, అందుకు అనుగుణంగా ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. పది మోటార్లను నిరంతరం నడిపి నీటిని ఎత్తిపోస్తే వరంగల్ జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులను నింపే అవకాశం ఉండేదని అన్నారు. ఈ విషయాన్ని తాను పలుమార్లు ప్రస్తావించానని, దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సహా జిల్లా నాయకులు కూడా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన సమ్మక్క బ్యారేజీ దేవాదుల ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు అనుకూలంగా ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఏడాదిలో సుమారు 300 రోజుల పాటు నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ అవకాశాన్ని వినియోగించుకోలేదని ఆరోపించారు. ముందుగానే నీటిని నిల్వ చేసి రిజర్వాయర్లు, చెరువులను నింపి ఉంటే ప్రస్తుత పరిస్థితి మరోలా ఉండేదని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ కంటే తక్కువ వర్షపాతం నమోదైనా అక్కడ పంటలు సాగవుతున్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా నీటిని వినియోగించుకుంటూ ఏపీ ప్రభుత్వం సాగునీటి అవసరాలను తీర్చుకుంటోందని అన్నారు. తెలంగాణలో వర్షపాతం లోటు 12 నుంచి 13 శాతం ఉండగా, ఏపీలో 25 శాతం వరకు ఉందని పేర్కొంటూ, అయినప్పటికీ అక్కడ పంటలకు నీరు అందుతోందని వ్యాఖ్యానించారు. తెలంగాణలో మాత్రం నీటి నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యం కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. దేవాదుల మోటార్లన్నింటినీ నడిపి నీటిని ఎత్తిపోసి ఉంటే వరంగల్ జిల్లాలో కరువు పరిస్థితులు ఎందుకు ఏర్పడేవని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు

ఇందిరమ్మ, డబుల్ బెడ్రూం ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతి

ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని కలిసిన నెమరుగొమ్ముల వేణుగోపాలరావు బృందం



పెద్దవంగర అక్టోబర్ 17 (మహాప్రభ)

ఇందిరమ్మ, డబుల్ బెడ్రూం ఇళ్లలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ నెమరుగొమ్ముల వేణుగోపాలరావు నేతృత్వంలో నాయకులు ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇళ్లకు విద్యుత్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను వివరించి, సమస్యను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వారి విజ్ఞప్తిపై ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సానుకూలంగా స్పందించారు. విద్యుత్ సౌకర్యం కల్పించే అంశంపై అనుకూలత వ్యక్తం చేయడంతో నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ నాయకులు దంతాలపల్లి రవి, మండల సీనియర్ నాయకులు బండారి వెంకన్న, చట్టు యాకన్న, వార్డు సభ్యులు బొల్లు ఉషయ్య, కేశబోయిన చంద్రబోస్, నాయకులు ముత్తినేని వెంకన్న, శివరాత్రి సంపత్‌కుమార్, బొల్లు వెంకన్న, దంతాలపల్లి యాకయ్య, బింగి ఉప్పయ్య పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ మండలంలో కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ నేతల చేరికలు

పోతన్‌పల్లి గ్రామంలో సర్పంచ్ సమక్షంలో పార్టీ మారిన ఉపసర్పంచ్ మైబన్న, యువ నాయకుడు కొనమోని నరేష్



మహబూబ్నగర్ ప్రత్యేక ప్రతినిధి అక్టోబర్ 17 మహాప్రభ

మహబూబ్‌నగర్ మండలంలోని పోతన్‌పల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ సర్పంచ్ ఎస్. మాధవరెడ్డి సమక్షంలో ఉపసర్పంచ్ మైబన్న కాంగ్రెస్ పార్టీలో చేరగా, గ్రామ అధ్యక్షుడు ఖలీల్ ఖాన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ యువ నాయకుడు కొనమోని నరేష్ సైతం కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు వారికి పార్టీలోకి ఆహ్వానం పలికారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సీనియర్ నాయకులు కటిక సత్యన్న, కే. రాములు, బాలచంద్రయ్య, ఆంజనేయులు, రాజు యాదవ్, వార్డు మెంబర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బతుకమ్మ పాటకు రాష్ట్రస్థాయి గుర్తింపు..

-ఆరేపల్లి బిడ్డకు మూడో బహుమతి!

- దర్శకత్వం వహించి నటించిన దొడ్లే మనీషా పాటిల్‌కు అరుదైన గౌరవం..



పాపన్నపేట అక్టోబర్17(మహాప్రభ)

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ పాటల పోటీల్లో ఆరేపల్లి గ్రామానికి చెందిన దొడ్లే మనీషా పాటిల్ సత్తా చాటారు. తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన బతుకమ్మ పాటల పోటీల్లో ఆమె దర్శకత్వం వహించి, నటించిన 'బుజ్జి బతుకమ్మ' పాటకు మూడో బహుమతి లభించింది. రాష్ట్రస్థాయిలో 'బుజ్జి బతుకమ్మ' పాటకు గుర్తింపు లభించడంతో ఆరేపల్లి గ్రామంలో ఆనందం వెల్లివిరిసింది. తమ గ్రామానికి చెందిన మనీషా పాటిల్ ప్రతిభకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావడంపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రజిత రాజశేఖర్‌తో పాటు గ్రామ ప్రజలు మనీషా పాటిల్‌ను అభినందించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ పాటకు గుర్తింపు తీసుకురావడం గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని విజయాలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

భూగర్భ జలాలు పరిరక్షించాలి





-జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

పాపన్నపేట, అక్టోబర్ 17 (మహాప్రభ)

పాపన్నపేట మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో వివి జిరామ్ జీ ఉపాధి హామీ పనులను పరిశీలించారు.

ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. పంటల సాగుకు నీటి కొరత లేకుండా,వర్షపు నీటిని ఒడిసిపట్టి అవసరమైన సమయంలో పంటలకు వినియోగించుకునేందుకు చేపడుతున్న ఫామ్ పాండ్ల నిర్మాణశీ,సామూహిక ఇంకుడుగుంతల నిర్మాణం,జలసిరి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఫామ్ పాండ్ల నిర్మాణ పనులకు ఎక్కువ మంది కూలీలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత లోతు,ఎత్తు,పొడవులతో ఫామ్ పాండ్ల నిర్మాణాలను చేపట్టాలని ఆదేశించారు.ప్రతి మండలంలో,ప్రతీ గ్రామ పంచాయతీలో ఐదు ఫామ్ పాండ్ల చొప్పున ఎంపిక చేసి,వాటి నిర్మాణ పనులను క్రమం తప్పకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు.నిర్మాణ పనులకు ప్రతిరోజూ ఎంత మంది కూలీలు హాజరవుతున్నారు.వారికి ఎంత మేర కూలి చెల్లిస్తున్నారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కూలీల హాజరును తప్పనిసరిగా నమోదు చేయడంతో పాటు, సంబంధిత వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అధికారులకు సూచించారు.గ్రామాల్లో భూగర్భ జల మట్టాల పెంపు,నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ వీబీ--జీ రామ్ జీ పథకం కింద అవసరమైన పనులను గుర్తించి,చేపట్టాలని సూచించారు.చెక్ డ్యామ్‌ల నిర్మాణం, మరమ్మతులు,ఇతర నీటి సంరక్షణ పనులకు సంబంధించి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.ఈకార్యక్రమంలో డిఆర్డీఓ శ్రీనివాసరావు,ఎంపీడీవో విష్ణువర్ధన్ రెడ్డి, తహసీల్దార్ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంథని మహాలక్ష్మి దేవిని సరస్వతి దేవి రూపంలో అలంకరణ చేసిన పూజారులు



మంథని, అక్టోబర్ 17 మహా ప్రభ

మంథని పట్టణంలోని మహాలక్ష్మి అమ్మవారిని సరస్వతీ దేవి రూపంలో దేదీప్యమానంగా పూజారులు అమ్మవారిని అలంకరించారు. ఈ అలంకరణలో భక్తులు భక్తి, శ్రద్ధలతో ఆరాధించారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు మంథని పట్టణంలోని పురవీధుల గుండా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తారు. వాడవాడల్లో ఉట్టి కట్టి గోపాల కాలువలు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు మారుపాక ప్రశాంత్, ఆలయ కమిటీ అధ్యక్షులు కనుకుంట్ల బాబు తెలిపారు. సకల విద్యలకు, జ్ఞానానికి, సంగీతానికి, సాహిత్యానికి, కళలకు అధిదేవత సరస్వతీ మాత. తెల్లని వస్త్రాలు ధరించి, కమలాసనంపై ఆసీనురాలై, చేతిలో వీణను ధరించి దర్శనమిచ్చే అమ్మవారి రూపం ప్రశాంతతకు, పవిత్రతకు, జ్ఞానానికి ప్రతీక. మనిషికి సంపద కంటే గొప్పది విద్య. అధికారానికి మించినది జ్ఞానం. అందానికి మించినది మంచి సంస్కారం. ఈ మూడింటినీ ప్రసాదించే కరుణామయి సరస్వతీ మాత. అమ్మవారి అనుగ్రహంతో చిన్నారులకు విద్యాబుద్ధులు, విద్యార్థులకు ఏకాగ్రత, యువతకు మంచి భవిష్యత్తు ప్రతి కుటుంబానికి సుఖ, శాంతులు సిద్ధిస్తాయి. అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానాన్ని అమ్మవారు ప్రసాదిస్తుంది..

అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి...

- మంథనిమాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

అక్టోబర్ 17 మహా ప్రభ



దుర్గామాత అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ వేడుకున్నారు. దుర్గాదేవి నవరాత్రోత్సవాల్లో బాగంగా మంథని పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో శ్రీ దుర్గాదేవి సంస్థాన్‌లో ప్రతిష్ఠించిన అమ్మవారిని కుటుంబసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో మంథని నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో,సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం పుట్ట దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమంలో వారు దీక్షాపరులకు స్వయంగా భిక్ష వడ్డించారు. అనంతరం దీక్షాపరులు పుట్ట దంపతులను శాలువాతో సత్కరించి మహాఅన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

బతుకమ్మతో తెలంగాణ సంస్కృతికి సరికొత్త శోభ..

-మహిళల ఐక్యతకు ప్రతీక: ఎమ్మెల్యే జీఎంఆర్

-భూత్పూర్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు..

-సతీసమేతంగా పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే





మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం అక్టోబర్ 17 మహా ప్రభ

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను భూత్పూర్ మున్సిపాలిటీ కేంద్రంలో మహిళలు ఘనంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ ఆడపడుచులు ఆటపాటలతో సందడి చేయగా, పండుగ వాతావరణం పట్టణంలో వెల్లివిరిసింది. ఈ వేడుకల్లో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) తన సతీమణితో కలిసి పాల్గొని మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని అన్నారు. ప్రకృతిలో సహజంగా లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి, ఆటపాటలతో జరుపుకునే ఈ వేడుక మన పూర్వీకుల ప్రకృతి ప్రేమను, పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను చాటిచెబుతుందని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ మహిళల మధ్య ఐక్యతను, పరస్పర ఆప్యాయతను పెంపొందించడంతో పాటు కుటుంబాల్లో ఆనందాన్ని, సమాజంలో సోదరభావాన్ని నింపుతుందని ఆయన అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న తెలంగాణ సంప్రదాయాలను కాపాడుతూ, వాటి విశిష్టతను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని సూచించారు. తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పేలా ప్రతి ఒక్కరూ ఘనంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం మహిళలకు మరోసారి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

డిండి ప్రాజెక్టు లో ఆర్.టి ఐ.ఎ.ఎస్.
నాగర్‌కర్నూల్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

-కమిటీ సభ్యులకు నియామక ఉత్తర్వులు అందజేసిన రాష్ట్ర అధ్యక్షులు డా. కొర్ర కిషన్ నాయక్



దేవరకొండ అక్టోబర్ 17(మహా ప్రభ)

గుండ్లపల్లి (డిండి ప్రాజెక్టు): నాగర్‌కర్నూల్ జిల్లాలో సమాచార హక్కు చట్టం--2005పై ప్రజలకు అవగాహన కల్పించడం, పారదర్శక పాలనను ప్రోత్సహించడం, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం వంటి లక్ష్యాలతో రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్టివిస్ట్ సొసైటీ (ఆర్టి ఐ – ఎ..ఎస్.) ఆధ్వర్యంలో గుండ్లపల్లి (డిండి ప్రాజెక్టు) ఐబీ గెస్ట్‌హౌస్‌లో జిల్లా నూతన కమిటీ సభ్యుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్టి ఐ.ఎ..ఎస్. రాష్ట్ర అధ్యక్షులు డా. కొర్ర కిషన్ నాయక్ నూతన కమిటీ సభ్యులకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం--2005 ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్న హక్కులపై అవగాహన కల్పిస్తూ, చట్టపరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి బాధ్యతాయుతంగా కృషి చేయాలని సభ్యులకు సూచించారు.

కార్యక్రమంలో ఆర్.టి ఐ.ఎ.ఎస్. రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. ఎం.డి. జిలానీ పాల్గొన్నారు. నూతనంగా నియామక ఉత్తర్వులు స్వీకరించిన నాగర్‌కర్నూల్ జిల్లా కమిటీ సభ్యుల వివరాలు ఇలా ఉన్నాయి.

జిల్లా అధ్యక్షులు: కటికర్ల లింగమయ్య

జిల్లా ఉపాధ్యక్షులు: దర్శ రామకృష్ణ

జిల్లా ప్రచార కార్యదర్శి: కొంపల్లి వేణుగోపాల్

అచ్చంపేట నియోజకవర్గ అధ్యక్షులు: భాషమోని సత్యనారాయణ

అచ్చంపేట నియోజకవర్గ ఉపాధ్యక్షులు: కొత్త కిరణ్ కుమార్

నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి: సంతోష్

నియోజకవర్గ కార్యదర్శి: దొడ్ల పరమేష్ యాదవ్

నియోజకవర్గ కార్యదర్శి: చంద్రశేఖర్

ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూ, సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు కృషి చేయాలని నిర్ణయించారు. ప్రజలకు చట్టబద్ధమైన మార్గాల్లో సమాచారాన్ని పొందడంలో అవగాహన కల్పించడం, ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత మరియు జవాబుదారీతనాన్ని ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టి ఐ.ఎ.ఎస్. ప్రతినిధులు, జిల్లా మరియు నియోజకవర్గ కమిటీ సభ్యులు, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరంజన్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే బాలు నాయక్

మృతురాలు శశికళ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే



దేవరకొండ, అక్టోబర్ 17:
దేవరకొండ పట్టణంలోని మొదటి వార్డుకు చెందిన రాపోలు నిరంజన్ భార్య శశికళ గత కొద్దిరోజుల క్రితం మృతి చెందిన విషయం తెలుసుకున్న దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ శనివారం వారి స్వగృహానికి వెళ్లి శశికళ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, వారి బాధలో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పున్న వెంకటేశ్వర్లు, మహ్మద్ రాయీస్, పొన్నెబోయిన సైదులు, కొర్ర రాంసింగ్, కిన్నెర హరికృష్ణ, ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్, మహ్మద్ ఉమేర్ తదితరులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ పార్టీ దేవరకొండ నియోజకవర్గ ఇంచార్జీ రమావత్ రవీంద్ర కుమార్



దేవరకొండ అక్టోబర్ 17(మహాప్రభ)
దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు .దేవరకొండ మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ దేవరకొండ నియోజకవర్గ ఇంచార్జీ రమావత్ రవీంద్ర కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....తొమ్మిది రోజులుగా ప్రకృతిని ఆరాధిస్తూ, వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి తెలంగాణ ఆడబిడ్డలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల నడుమ రాష్ట్ర పండుగ బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకోవడం సంతోషకరమని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.ప్రకృతితో మమేకమై, పూలను పూజిస్తూ జరుపుకునే బతుకమ్మ పండుగ మన సంస్కృతికి ప్రత్యేక గుర్తింపునిస్తుందని తెలిపారు. బతుకమ్మ పండుగ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ప్రకృతిని పరిరక్షించాలని, పచ్చదనాన్ని పెంపొందించాలని, నీటి వనరులను కాపాడుకోవాలని నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు.సద్దుల బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సంతోషాన్ని నింపాలని, తెలంగాణ ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు.

ఘనంగా దేవి నవరాత్రుల మహోత్సవాలు



దేవరకొండ అక్టోబర్ 17 (మహాప్రభ)
దేవరకొండ పట్టణంలోని 17వ వార్డులో వేంచేసియున్న హరిహర దేవస్థానం వద్ద వెలసిన జగన్మాత అమ్మవారికి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ--- జగన్మాత ఆశీస్సులతో దేవరకొండ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సకల ఐశ్వర్యాలతో సంతోషంగా ఉండాలని, ప్రజలందరికీ శుభం కలగాలని ఆకాంక్షించారు. ఈ పూజా కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టే...

-గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి



తూప్రాన్ అక్టోబర్ 17,(మహాప్రభ)
అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టేనని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నరసారెడ్డి అన్నారు శనివారం తూప్రాన్ లోని మహంకాళి దేవాలయ ఆవరణలో నవదుర్గ నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు రాజరాజేశ్వరి మాతకు ప్రత్యేక పూజలు కుంభహారతి నక్షత్ర హారతి నిర్వహించారు అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ రాముని గారి స్వప్న నాగరాజు గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విట్టల్ రెడ్డి వైస్ చైర్మన్ మామిండ్ల కృష్ణ ముదిరాజ్ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు సంతోష్ రెడ్డి, పల్లెర్ల రవీందర్ గుప్తా, నాగేష్ ముదిరాజ్, జింక మల్లేష్, ఆంజనేయులు గౌడ్, పురం రవి, సబ్బని వెంకటేష్ , బాయికాడి వెంకటేష్, మాజీ కౌన్సిలర్ మామిడి వెంకటేష్ తాటి విట్టల్, నిర్వాహకులు కోటేశ్వరరావు, మహేష్ గౌడ్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు .

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్వోత్తం రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

-త్యాగాల కుటుంబానికి ఎమ్మెల్సీ టికెట్ కేటాయించిన కాంగ్రెస్ అధిష్ఠానానికి కృతజ్ఞతలు
-దేవరకొండ నియోజకవర్గం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

దేవరకొండ అక్టోబర్ 17(మహాప్రభ)
ఉమ్మడి నల్లగొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పిలుపునిచ్చారు. దేవరకొండ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీ సాధించేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహకంలో భాగంగా దేవరకొండ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు విడివిడిగా నిర్వహించిన సమావేశాల్లో ఎమ్మెల్యే పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ.. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి నల్లగొండ జిల్లాతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన నాయకుడని పేర్కొన్నారు. ప్రజాసేవకు, కాంగ్రెస్ పార్టీకి అంకితమైన త్యాగాల కుటుంబానికి చెందిన





రాంరెడ్డి సర్వోత్తం రెడ్డికి ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సర్వోత్తం రెడ్డి విజయాన్ని ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త తమ వ్యక్తిగత బాధ్యతగా భావించి పనిచేయాలని అన్నారు.
ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తం రెడ్డి అయినప్పటికీ, ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త తానే అభ్యర్థిననే భావనతో ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని ఎమ్మెల్యే సూచించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని, నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పార్టీ శ్రేణులు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.
పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే బాలు నాయక్ స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, పట్టభద్రులు, కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్లు సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు చేయించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఒక్క పట్టభద్రుడి ఓటును కూడా నిర్లక్ష్యం చేయవద్దని, ప్రతి ఓటు పార్టీ విజయానికి కీలకమని అన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకత్వం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటాన్ని ఎమ్మెల్యే ప్రస్తావిస్తూ, పార్టీ నాయకత్వానికి, కార్యకర్తలకు మరింత ఐక్యతతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా ప్రతి గ్రామంలో పట్టభద్రులను కలిసి ఓటు నమోదు, ఎన్నికలపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ సన్నాహక సమావేశాల్లో జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, సర్పంచులు, పట్టభద్రులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాల్లో గాంధారి మండల సమాఖ్యకు జిల్లా స్థాయి అవార్డు

-కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న అధ్యక్షురాలు అంబాలక్ష్మి





గాంధారి /అక్టోబర్ 17 (మహాప్రభ)
జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం రోజున నిర్వహించిన బతుకమ్మ సంబరాల వేడుకల్లో గాంధారి మండల సమాఖ్యకు జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు లభించింది. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా గాంధారి మండల సమాఖ్య అధ్యక్షురాలు శ్రీమతి అంబాలక్ష్మి ఈ అవార్డును అందుకున్నారు. బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా, సంప్రదాయ బద్ధంగా నిర్వహించి, ఉత్తమ ప్రదర్శన కనబరిచి నందుకు ఈ అవార్డు లభించింది.గాంధారి మండల సమాఖ్యకు జిల్లా స్థాయిలో అవార్డు రావడం మండలానికే గర్వకారణమని మండల సమాఖ్య సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం ప్రసన్న కుమార్, సిసి సౌజన్య, గొర్రె రాములు, అకౌంటెంట్ సుధాకర్, వివోలు శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాల వేడుకలు

-మహిళలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ రేణుక సంజీవ్ యాదవ్



గాంధారి: అక్టోబర్ 17 (మహాప్రభ)
ప్రతి సంవత్సరం సాంప్రదాయబద్ధంగా జరుపుకునే బతుకమ్మ వేడుకలు గాంధారి మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆడపడుచులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రేణుక సంజీవ్ యాదవ్ మాట్లాడుతూ.. గాంధారి మండలంలో ప్రతి ఇంటా ఆడపడుచులు బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకుంటున్నారని, తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు నిదర్శనమని అన్నారు. బతుకమ్మ, దసరా నవరాత్రుల సందర్భంగా గ్రామ ప్రజలకు, మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహిస్తూ మహిళలు హర్షం వ్యక్తం చేశారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ..



తూప్రాన్ అక్టోబర్ 17,(మహాప్రభ)
తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలోని మహంకాళి దేవాలయ ఆవరణలో గత 28 సంవత్సరాలుగా నవ దుర్గా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు శనివారం శివంపేట మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అమ్మవారి కృపా కటాక్షాలు అందరిపై ఉండాలని వారికి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో విడు జిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు చెలిమిల రఘుపతి, రమేష్, రాము నిర్వాహకులు కోటి తాటి విట్టల్ మహేష్ గౌడ్ సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

దేవరకొండ మున్సిపాలిటీ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



దేవరకొండ అక్టోబర్ 17(మహాప్రభ)
దేవరకొండ మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం సాయంత్రం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మన తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలను ప్రతీకగా బతుకమ్మ పండగ సంబరాలను అత్యుత్సాహంతో ఆనందంతో మున్సిపాలిటీ కార్యాలయ సిబ్బంది ప్రకృతిలో దొరికే రకరకాల రంగులు కలిగిన పువ్వులతో బతుకమ్మలను పేర్చి చుట్టూరా బతుకమ్మ ఆడుతూ పాటలు పాడుతూ చప్పట్లతో ఘనంగా బతుకమ్మ సంబరాలను జరుపుకొని సంతోషించారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్పర్సన్ వున్న శైలజ వెంకటేశ్వర్లు. కమిషనర్ రామ దుర్గారెడ్డి. శానిటేషన్ ఇన్స్పెక్టర్ సురిగి శంకర్. కార్యాలయ సిబ్బంది, కౌన్సిలర్స్ సంప్రదాయ వస్త్రాలను ధరించి బతుకమ్మ వేడుకను ఘనంగా జరుపుకొన్నారు

సీనియర్ జర్నలిస్టు రఘు మృతికి

-సంతాపం ప్రకటించిన దేవరకొండ జర్నలిస్టులు



దేవరకొండ అక్టోబర్ 17 (మహాప్రభ)
సీనియర్ జర్నలిస్టు, ఆర్ఎన్ఏ న్యూస్ ఏజెన్సీ చీఫ్ ఎడిటర్ అవ్వారు రఘు శుక్రవారం రాత్రి మృతిచెందారు. నెల రోజులుగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ.. గచ్చిబౌలిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి కన్నుమూశారు. జనగామ జిల్లా బచ్చన్నపేట కు చెందిన రఘు..1986లో ఉదయం పత్రికలో సబ్ ఎడిటర్ గా కెరీర్ ప్రారంభించి, క్రిష్ణపత్రిక, వర్తమానం, నేటినిజం.తదితర మీడియా సంస్థల్లో బ్యూరో చీఫ్ గా పనిచేశారు. ఆ తర్వాత టీవీ5లో చీఫ్ సబ్ ఎడిటర్ బాధ్యతలు నిర్వహించారు. నాలుగు దశాబ్దాలుగా మీడియా రంగంలో పనిచేసిన ఆయన జర్నలిస్టుల సమస్యలపై పలు కార్యక్రమాల్లో పనిచేశారు. అవ్వారు రఘు అకాల మృతి పట్ల దేవరకొండ జర్నలిస్టులు వి.జోసేఫ్, పి. గోవర్ధన్ ,శ్రీను, తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

గొడ్డలి వేటుతో రక్తసిక్తమైన జీనుగారాల.. భూ వివాదంలో నిద్రిస్తున్న దంపతులపై దారుణం

-తీవ్రంగా గాయపడిన భార్య, పరిస్థితి విషమం.. హైదరాబాద్‌కు తరలింపు

-పరారీలో నిందితుడు బాలరాజు.. దేవరకద్ర పోలీసుల దర్యాప్తు



దేవరకద్ర నియోజకవర్గ అక్టోబర్ 17 మహాప్రభ

పెదవులు కదపని భూతగాదాలు చివరకు నెత్తుటి ఏరులు పారించాయి. పచ్చని పొలాల గట్లపై మొదలైన కక్షలు.. నిద్రపోతున్న ప్రాణాల మీదకు తెచ్చాయి. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం జీనుగారాల గ్రామంలో అర్ధరాత్రి జరిగిన ఈ కిరాతక ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఆస్తి తగాదాలతో కక్ష పెంచుకున్న ఓ బంధువు.. అర్ధరాత్రి వేళ నిద్రలో ఉన్న భార్యాభర్తలపై గొడ్డలితో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దారుణంలో భార్య ముఖం తీవ్ర గాయాలతో ఛిద్రం కాగా, ఆమె పరిస్థితి అత్యంత విషమంగా ఉంది.

అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడి..

స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీనుగారాల గ్రామానికి చెందిన గరిగంటి మన్నెమ్మ, ఆమె భర్త భాస్కర్‌లకు, వారి దాయాది బాలరాజుకు కొంతకాలంగా పొలం సరిహద్దుల విషయమై వివాదాలు నడుస్తున్నాయి. ఈ పంచాయితీలు పోలీస్ స్టేషన్ల వరకు వెళ్లినా మనస్పర్థలు తొలగిపోలేదు. ఇదే కక్షను మనసులో పెట్టుకున్న బాలరాజు.. దంపతులను అంతం చేయాలని పథకం పన్నాడు.

ఈ నెల 16వ తేదీ అర్ధరాత్రి దాటాక సరిగ్గా 12 గంటల సమయంలో దంపతులిద్దరూ ఇంట్లో గాఢ నిద్రలో ఉన్నారు. ఇదే అదనుగా భావించిన నిందితుడు బాలరాజు పక్కా ప్లాన్‌తో వారి ఇంట్లోకి ప్రవేశించాడు. నేరుగా మన్నెమ్మ వద్దకు వెళ్లి నిద్రలోనే ఆమెపై గొడ్డలితో నరికాడు. ఈ ?స దాడిలో ఆమె నోరు, చెంపల భాగాలు తీవ్రంగా దెబ్బతిని రక్తపు మడుగులో కుప్పకూలింది.

అడ్డుబోయిన భర్తపై కూడా..

భార్య ఆర్తనాదాలు, కేకలు విని ఉలిక్కిపడి లేచిన భర్త భాస్కర్.. కళ్ల ముందే జరుగుతున్న ఘోరాన్ని చూసి భయంతో పాటు తెగించి నిందితుడిని అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో బాలరాజు భాస్కర్‌పై కూడా గొడ్డలితో దాడి చేసి స్వల్పంగా గాయపరిచాడు. అదే సమయంలో సమీపంలో జరుగుతున్న దుర్గామాత ఉత్సవాలను తిలకించి అటువైపుగా వస్తున్న గ్రామానికి చెందిన అంజన్న కేకలు వేస్తూ అక్కడికి పరిగెత్తుకుంటూ వచ్చాడు. ఊహించని పరిణామానికి బెదిరిపోయిన నిందితుడు బాలరాజు.. స్థానికులు అప్రమత్తం కావడంతో చీకటిలో గొడ్డలితో సహా అక్కడి నుంచి పరారయ్యాడు.

మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు..

కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే స్పందించి రక్తస్రావంతో కొట్టుమిట్టాడుతున్న మన్నెమ్మను హుటాహుటిన మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆమె ముఖంపై గాయాలు తీవ్రంగా ఉండటం, మెదడు చుట్టూ రక్తస్రావం కావడంతో ప్రాణాపాయ స్థితికి చేరుకుంది. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ఆమెను హడావుడిగా హైదరాబాద్‌లోని కార్పొరేట్/ప్రధాన ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె కోలుకోవడం కోసం వైద్యులు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

కేసు నమోదు చేసి గాలింపు చర్యలు..

ఈ దారుణ ఘటనపై బాధితురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవరకద్ర ఎస్సై భాస్కర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. నిందితుడు బాలరాజు కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. భూ తగాదాలు పచ్చని కాపురంలో చిచ్చుపెట్టి, ఒకరి ప్రాణాల మీదకు తెచ్చిన తీరు జీనుగారాల గ్రామంలో విషాద ఛాయలను నింపింది.

జూన్‌లోగా పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి







-రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం

-దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర నియోజకవర్గం అక్టోబర్ 17 మహాప్రభ

భూత్పూర్: పాలమూరు ప్రాంత రైతుల సాగునీటి కలను సాకారం చేసే దిశగా పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వచ్చే జూన్‌లోగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి (జీఎంఆర్) తెలిపారు. రైతులకు సాగునీటి వసతి కల్పించడంతోపాటు విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. శనివారం భూత్పూర్ మున్సిపల్ కేంద్రంలో నిర్వహించిన ట్రాన్స్‌ఫార్మర్లు, స్ప్రింక్లర్లు, సబ్సిడీ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో ఎండల తీవ్రత పెరిగి విద్యుత్ వినియోగం అధికమవుతోందన్నారు. దీంతో విద్యుత్ సరఫరాపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూత్పూర్, మూసాపేట, అడ్డాకుల మండలాల్లో విద్యుత్ అవసరాలు అధికంగా ఉన్న గ్రామాలను గుర్తించి సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. వ్యవసాయ పనులకు ఆటంకం కలగకుండా విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలపై ఎమ్మెల్యే స్పందించారు. గతంలో కరోనా వచ్చినప్పుడు వారి పాలనలో పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేస్తామని గత పాలకులు ప్రకటించినప్పటికీ, తొమ్మిదేళ్లు అధికారంలో ఉన్నా ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఆశించిన ప్రయోజనం కల్పించలేకపోయారని విమర్శించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి, రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ భీమా నాయక్, భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బాలకోటి, కాంగ్రెస్ నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దుర్గమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే బాలునాయక్





-రామాలయం, మార్కండేయ స్వామి ఆలయం, పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు

దేవరకొండ, అక్టోబర్ 17:(మహాప్రభ)

దేవరకొండ పట్టణంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న నేపథ్యంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ శనివారం పలు ఆలయాలను సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవరకొండ పట్టణంలోని మొదటి వార్డులో గల రామాలయంలో కొలువుదీరిన దుర్గమ్మ తల్లిని ఎమ్మెల్యే బాలునాయక్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం దేవరకొండ నుంచి కొండమల్లేపల్లికి వెళ్లే మార్గంలో ఉన్న మార్కండేయ స్వామి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకున్నారు. అదే ఆలయంలో కొలువుదీరిన దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నా అనంతరం దేవరకొండ పట్టణంలోని 16"వ వార్డులో ఉన్న పరమేశ్వరి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లోని భక్తులతో మాట్లాడి నవరాత్రి ఉత్సవాల విశేషాలను తెలుసుకున్నారు. శరన్నవరాత్రులు హిందూ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన పర్వదినాలని, తొమ్మిది రోజులపాటు దుర్గాదేవి తొమ్మిది రూపాలను ఆరాధించడం ఈ ఉత్సవాల ప్రత్యేకతని భక్తులు విశ్వసిస్తారు. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి నవరాత్రులు ప్రతీకగా నిలుస్తాయి. శక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించడం ద్వారా ధైర్యం, ఆత్మవిశ్వాసం, మనోధైర్యం పెంపొందుతాయని భక్తుల నమ్మకం. నవరాత్రి ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక వేడుకలకే పరిమితం కాకుండా ప్రజల మధ్య ఐక్యతను, భక్తిభావాన్ని, సంప్రదాయాల పరిరక్షణను చాటిచెబుతాయి. ఆలయాల్లో నిర్వహించే ప్రత్యేక పూజలు, భజనలు, కుంకుమార్చనలు భక్తులకు ఆధ్యాత్మిక ప్రశాంతతను అందిస్తాయి. ఈ పవిత్ర పర్వదినాలు సమాజంలో సోదరభావం, పరస్పర గౌరవం, సేవాభావం మరింత పెంపొందించేందుకు దోహదపడతాయి. ఈ కార్యక్రమాల్లో పున్న శైలజ వెంకటేశ్వర్లు, ఆలంపల్లి నర్సింహా, ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్, పొన్నెబోయిన సైదులు, ఆయా ఆలయాల భక్తులు పాల్గొన్నారు.

శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్న పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ





శేరిలింగంపల్లి,(అక్టోబర్17) మహాప్రభ

శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని మసీదు బండ లో దసరా పర్వదినం పురస్కరించుకుని శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జరిగిన పూజ కార్యక్రమంలో సీనియర్ నాయకుల రఘునాథ్ రెడ్డి గారు, సీనియర్ నాయకులు మారబోయిన రాజు యాదవ్ తో కలసి ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం తీసుకొని ప్రత్యేక పూజలు చేసిన పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ కార్యక్రమంలోమాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, నాయకులు మల్లేష్ యాదవ్, మల్లేష్, నరేందర్ బల్ల, పవన్ ,మల్లేష్,విజయ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

కోరిపల్లి క్రాస్ వద్ద రోడ్డు ప్రమాదం

బొలెరో ఢీకొని ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు







పెద్దవంగర, అక్టోబర్ 17 (మహాప్రభ)

పెద్దవంగర మండలంలోని కోరిపల్లి క్రాస్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజేష్, ప్రశాంత్ అనే ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారి కాళ్లు విరిగినట్లు సమాచారం. హైదరాబాద్ నుంచి టేకుల తండాకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకులను, హైదరాబాద్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొట్టినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

లలితాత్రిపుర సుందరి దేవిగా వనదుర్గమ్మ..

- అంగరంగ వైభవంగా సాగుతున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

- తీరొక్క మొక్కులు చెల్లించుకుంటున్న భక్తజనం

- నేడు దుర్గాదేవిగా భక్తులకు వనదుర్గమ్మ దర్శనం



పాపన్నపేట అక్టోబర్17(మహాప్రభ)

భక్తులు కోరిన కోరికలు తీర్చే ఇంటి ఇలవేల్పుగా.. దేశంలోని రెండో వన దుర్గామాత ఆలయంగా.. జనమేజయుని సర్పయాగస్థలిగా వినతికెక్కిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పాపన్నపేట మండలం ఏడుపాయల వన దుర్గాదేవి క్షేత్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఏడవ రోజైన శనివారం సప్తమి పురస్కరించుకొని వన దుర్గామాతను శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి ఈ రూపంలో, నారింజ రంగు చీర, వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వేకువ జామునే అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించి నారింజ రంగు చీర, వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అమ్మ దర్శనం కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నేడు వనదుర్గాదేవిగా భక్తులకు వనదుర్గమ్మ దర్శనం

-దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఎనిమిదవ రోజైన ఆదివారం వనదుర్గామాత దుర్గాదేవి రూపం, ఎరుపు రంగు వస్త్రంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారని అర్చకులు, ఆలయ సిబ్బంది పేర్కొన్నారు.

మళ్లీ పెరిగిన ముడిచమురు ధరలు..

బ్రెంట్ క్రూడ్ ధర ఎంతంటే..!

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు మళ్లీ పెరిగాయి. సరఫరా సమస్యలు త్వరలో తీరుతాయన్న ఆశలు సన్నగిల్లడంతో బ్రెంట్ క్రూడ్ ధర 110 డాలర్లకు చేరువైంది. కాగా మే నెల తర్వాత ముడిచమురు ధరలు ఈ స్థాయిని తాకడం ఇదే తొలిసారి. పశ్చిమాసియా లో ఉద్రిక్తతలు, రష్యా-ఉక్రెయిన్ మధ్య దాడులు చమురు సరఫరాపై ఆందోళనలు పెరిగేలా చేస్తున్నాయి.దాంతో ప్రస్తుతం బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 109.69 డాలర్‌లు అయ్యింది. గత ముగింపుతో పోలిస్తే ఇది 3.56 శాతం అధికం. అంతర్జాతీయంగా సరఫరా పరిస్థితులు బలహీనంగా ఉండటంతో ధరలు మరింత పెరుగుతాయన్న అంచనాలు ట్రేడర్లు కొనుగోళ్లపై



ఆసక్తి చూపేలా పురికొల్పుతున్నాయి. సౌదీ అరేబియాపై ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారుల క్షిపణి, డ్రోన్ దాడులు కొనసాగుతున్నాయి. మరోవైపు రష్యా, ఉక్రెయిన్ పరస్పరం ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు చేసుకుంటున్నాయి. రష్యాలోని ర్యాజాన్ చమురు శుద్ధి కర్మాగారంపై దాడి జరిగినట్లు వచ్చిన వార్తలతో అక్కడ కార్యకలాపాలు నిలిచిపోయినట్లు తెలిసింది. ఈ పరిణామాలు చమురు సరఫరాపై ఒత్తిడిని పెంచుతున్నాయి. మరోవైపు నవంబర్ 3 ఎన్నికల తర్వాత ఇరాన్‌పై 'మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్' వినియోగించే అవకాశాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తోసిపుచ్చలేదని న్యూస్‌మాక్స్ కథనం పేర్కొన్నది. 2026 డిసెంబర్‌లో బ్రెంట్ క్రూడ్ ధర 90 డాలర్లకు చేరవచ్చని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. గతంలో వేసిన 85 డాలర్ల అంచనాను పెంచింది. పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమైన ఫిబ్రవరి చివరలో బ్రెంట్ క్రూడ్ ధర సుమారు 70 డాలర్లుగా ఉంది. హర్మూజ్ జలసంధిలో రవాణాకు ఆటంకాలు ఏర్పడటంతో అది 125 డాలర్లకు పైగా దూసుకుపోయింది. ఆ తర్వాత తగ్గిన ధరలు ఇప్పుడు మళ్లీ 110 డాలర్ల స్థాయికి చేరువయ్యాయి.

స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు

-24 క్యారెట్ల బంగారంపై రూ.220 పెరుగుదల
-రూ.1,47,660కు చేరిన 10 గ్రాముల పసిడి ధర
-22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.200 పైకి
-రూ.1,35,350కు చేరిన 10 గ్రాముల ధర
-కిలో వెండి ధరలో మార్పులేదు
-హైదరాబాద్ బులియన్ మార్కెట్లో తాజా ధరలు
-ప్రాంతాలను బట్టి ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు
-కొనుగోలుదారులు తాజా ధరలను పరిశీలించుకోవాలి



హైదరాబాద్

బులియన్ మార్కెట్లో శనివారం బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.220 పెరిగి రూ.1,47,660కు చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.200 ఎగబాకి రూ.1,35,350 పలుకుతోంది.

మరోవైపు వెండి ధరలో మార్పు కనిపించలేదు. హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి ధర రూ.2,40,000 వద్ద కొనసాగుతోంది. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలను బట్టి బంగారం, వెండి ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉండవచ్చు. కొనుగోలుదారులు ఆభరణాలు కొనుగోలు చేసే ముందు స్థానిక వ్యాపారుల వద్ద తాజా ధరలను తెలుసుకోవడం మంచిది.

దసరా సేల్‌లో ఐఫోన్లపై భారీ రాయితీలు

క్రోమా 'ఫెస్టివల్ ఆఫ్ డ్రీమ్స్' సేల్ ప్రారంభం
ఐఫోన్ 17 ధర రూ.58,990 నుంచి..
మ్యాక్‌బుక్ ఎయిర్, ఐప్యాడ్‌లపైనా ప్రత్యేక ఆఫర్లు

దసరా పండుగ సందర్భంగా టాటా గ్రూప్‌కు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్స్ రిటైల్ సంస్థ క్రోమా 'ఫెస్టివల్ ఆఫ్ డ్రీమ్స్' సేల్‌ను ప్రారంభించింది. ఇందులో భాగంగా ఆపిల్ పరికరాలపై ప్రత్యేక తగ్గింపులు అందిస్తోంది. ముఖ్యంగా ఐఫోన్ 17 సిరీస్ కొనుగోలుదారులకు ఎక్స్చేంజ్ బోనస్, క్యాష్‌బ్యాక్ సదుపాయాలను కల్పిస్తోంది. ఈ ఆఫర్లతో ఐఫోన్‌లను తక్కువ ధరకు కొనుగోలు చేసే అవకాశం వినియోగదారులకు లభించనుంది. సేల్‌లో భాగంగా ఐఫోన్ 17 ప్రారంభ ధర రూ.58,990గా ఉంది. ఐఫోన్ 17 ప్రో ధర రూ.94,490 నుంచి, ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ ధర రూ.1,07,990 నుంచి అందుబాటులో ఉన్నట్లు ప్రకటించారు. పాత ఫోన్‌ను ఎక్స్చేంజ్ చేయడం, వర్తించే క్యాష్‌బ్యాక్ ఆఫర్లను వినియోగించుకోవడం ద్వారా కొనుగోలు ధరలో మరింత తగ్గింపు పొందే అవకాశం ఉంది.



ఐఫోన్లతోపాటు ఆపిల్ మ్యాక్‌బుక్ ఎయిర్, ఐప్యాడ్‌లపైనా క్రోమా ప్రత్యేక రాయితీలను అందిస్తోంది. పండుగ సమయంలో కొత్త ఎలక్ట్రానిక్ పరికరాలను కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులను ఆకర్షించడమే ఈ సేల్ లక్ష్యంగా ఉంది. అయితే ఆఫర్లకు సంబంధించిన నిబంధనలు, అర్హతలు, తుది ధరలు మోడల్, ఎక్స్చేంజ్ ఫోన్ విలువ, చెల్లింపు విధానాన్ని బట్టి మారవచ్చు. కొనుగోలు చేసే ముందు క్రోమా వద్ద ప్రస్తుత ధరలు, ఆఫర్ల గడువు, నిబంధనలను పరిశీలించడం మంచిది.

హెడ్ కోచ్ జయవర్ధనేతో బంధానికి తెర..

-కొత్త హెడ్‌కోచ్ కోసం ముంబై ఇండియన్స్ కసరత్తు..!

ముంబై ఇండియన్స్ ఐపీఎల్ ఫ్రాంచైజీ, ఆ ఫ్రాంచైజీ టీమ్ హెడ్ కోచ్ మహేల జయవర్ధనే మధ్య తొమ్మిదేళ్ల బంధానికి తెరపడింది. ఐపీఎల్‌లో ఐదుసార్లు టైటిల్ దక్కించుకున్న ముంబై ఇండియన్స్ కీలక నిర్ణయం తీసుకుంది. జట్టు హెడ్ కోచ్ మహేల జయవర్ధనేతో బంధాన్ని ముగించుకుంది. ఇరుపక్షాలు పరస్పర అంగీకారంతో విడిపోవాలని నిర్ణయించుకున్నాయి.పోయిన ఐపీఎల్ సీజన్‌లో జట్టు ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో వచ్చే సీజన్‌కు కొత్త కోచ్‌ను నియమించేందుకు ఫ్రాంచైజీ సిద్ధమవుతున్నది. గడిచిన ఐపీఎల్ సీజన్ ముంబై ఇండియన్స్‌కు నిరాశనే మిగిల్చింది. ఆ సీజన్‌లో జట్టు కేవలం నాలుగు గెలుపులతో సరిపెట్టుకుంది. ఆటగాళ్లు గాయాలపాలవడం, కొందరు అందుబాటులో లేకపోవడం, డ్రెస్సింగ్ రూమ్‌లో విభేదాలు ఉన్నాయన్న వార్తలు జట్టు ప్రదర్శనపై ప్రభావం చూపినట్లు కథనాలు వెలువడ్డాయి. కొత్త హెడ్ కోచ్ ఎంపిక కోసం ఫ్రాంచైజీ ఇప్పటికే పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. కాగా ముంబైతో జయవర్ధనే ప్రయాణం 2017లో ప్రారంభమైంది. ఆయన కోచింగ్‌లో జట్టు 2017, 2019, 2020



సీజన్లలో ఐపీఎల్ టైటిళ్లు సాధించింది. దాంతో ఫ్రాంచైజీ చరిత్రలో అత్యంత విజయవంతమైన కోచ్‌లలో ఒకరిగా జయవర్ధనే గుర్తింపు పొందాడు. ముంబైతో తన అనుబంధం పదేళ్లకు పైగా కొనసాగిందని జయవర్ధనే చెప్పాడు. ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది, అభిమానులతో కలిసి ఎన్నో మధుర జ్ఞాపకాలు సృష్టించుకున్నామని తెలిపాడు. తనపై నమ్మకం ఉంచిన నీతా అంబానీ, ఆకాశ్ అంబానీలకు కృతజ్ఞతలు చెప్పాడు. ముంబై ఇండియన్స్‌కు ఆయన అందించిన సేవలను నీతా అంబానీ కూడా ప్రశంసించారు. జయవర్ధనే ఎప్పటికీ తమ 'వన్ ఫ్యామిలీ' లో భాగమేనని పేర్కొన్నారు.

ఢిల్లీ క్యాపిటల్స్ బౌలింగ్ కోచ్‌గా చామిండ వాస్!

-మునాఫ్ పటేల్ స్థానంలో శ్రీలంక మాజీ బౌలర్ నియామకం
-ఐపీఎల్ కొత్త సీజన్‌కు ఢిల్లీ జట్టు సన్నద్ధం
-టెస్టుల్లో 355 వికెట్లు తీసిన వాస్
-వన్డేల్లో 400 వికెట్లతో అరుదైన ఘనత
-సోషల్ మీడియా వేదికగా నియామకాన్ని ప్రకటించిన ఢిల్లీ క్యాపిటల్స్
-ప్రధాన కోచ్‌గా సౌరవ్ గంగూలీ బాధ్యతలు
-బ్యాటింగ్, సహాయ కోచ్‌గా యువరాజ్ సింగ్
-తొలి ఐపీఎల్ టైటిల్‌పై ఢిల్లీ క్యాపిటల్స్ గురి



న్యూఢిల్లీ

శ్రీలంక మాజీ దిగ్గజ బౌలర్ చామిండ వాస్ మరోసారి క్రికెట్ రంగంలోకి అడుగుపెడుతున్నారు. రాబోయే ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించనున్నారు. గత రెండు సీజన్లుగా ఈ బాధ్యతలు నిర్వహించిన మునాఫ్ పటేల్ స్థానంలో వాస్ నియమితులయ్యారు. కొత్త సీజన్‌కు జట్టును సిద్ధం చేసే క్రమంలో ఢిల్లీ యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది.

శ్రీలంక తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లో వాస్ విశేషంగా రాణించారు. 111 టెస్టుల్లో 355 వికెట్లు, వన్డేల్లో 400 వికెట్లు సాధించారు. తన అనుభవంతో ఢిల్లీ బౌలింగ్ విభాగాన్ని మరింత పటిష్ఠం చేయడంపై ఆయన దృష్టి సారించనున్నారు. వాస్ నియామకాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ తన అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా ప్రకటించింది. ప్రపంచకప్ విజేత, శ్రీలంక అత్యుత్తమ బౌలర్లలో ఒకరైన వాస్‌కు స్వాగతం పలుకుతున్నట్లు పేర్కొంది.

ఢిల్లీ క్యాపిటల్స్ ప్రధాన కోచ్‌గా సౌరవ్ గంగూలీ, బ్యాటింగ్, సహాయ కోచ్‌గా యువరాజ్ సింగ్ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. అనుభవజ్ఞులైన మాజీ క్రికెటర్లతో కోచింగ్ బృందాన్ని సిద్ధం చేసుకుంటున్న ఢిల్లీ, ఈసారి టైటిల్ సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

ఐపీఎల్‌లో ఇప్పటివరకు ఢిల్లీ క్యాపిటల్స్ టైటిల్ గెలవలేదు. 2020 సీజన్‌లో మాత్రం ఫైనల్‌కు చేరింది. జీఎంఆర్, జేఎస్‌డబ్ల్యూ గ్రూపుల యాజమాన్యంలో కొనసాగుతున్న ఈ జట్టు, కొత్త కోచింగ్ బృందం మార్గదర్శకత్వంలో ఈసారి ఎలాంటి ప్రదర్శన చేస్తుందో చూడాలి.

భారత క్రికెట్‌కు ముత్తూట్ ఫిన్‌కార్ప్ టైటిల్ స్పాన్సర్!

2028 మార్చి 31 వరకు ఒప్పందం అమలు
అంతర్జాతీయ, దేశవాళీ మ్యాచ్‌లకు వర్తింపు
భారత్‌లో జరిగే క్రికెట్ పోటీలకు బ్రాండ్ భాగస్వామ్యం

న్యూఢిల్లీ:

భారత క్రికెట్‌కు టైటిల్ స్పాన్సర్‌గా ముత్తూట్ ఫిన్‌కార్ప్ వ్యవహరించనుంది. భారత్‌లో నిర్వహించే అంతర్జాతీయ, దేశవాళీ క్రికెట్ మ్యాచ్‌లకు సంబంధించిన టైటిల్ స్పాన్సర్ హక్కులను ఆ సంస్థ దక్కించుకుంది. ఈ ఒప్పందం 2028 మార్చి 31 వరకు అమల్లో ఉండనుంది. ఈ భాగస్వామ్యంతో భారత క్రికెట్ పోటీల ద్వారా సంస్థకు తన బ్రాండ్‌ను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం లభించనుంది.

అంతర్జాతీయ, దేశవాళీ మ్యాచ్‌లకు వర్తింపు

ఈ ఒప్పందం ప్రకారం భారత్‌లో జరిగే అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లతోపాటు దేశవాళీ పోటీలకు కూడా ముత్తూట్ ఫిన్‌కార్ప్ టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరించనుంది. అంతర్జాతీయ జట్ల మధ్య జరిగే సిరీస్‌లు, దేశవాళీ క్రికెట్ పోటీల ద్వారా సంస్థ బ్రాండ్‌కు ప్రచారం లభించే అవకాశం ఉంది. అయితే ఒప్పంద పరిధిలోకి వచ్చే టోర్నీలు, మ్యాచ్‌ల పూర్తి



వివరాలు అధికారిక ప్రకటనల ద్వారా స్పష్టమయ్యే అవకాశం ఉంది.

2028 మార్చి 31 వరకు భాగస్వామ్యం

ముత్తూట్ ఫిన్‌కార్ప్‌తో కుదిరిన స్పాన్సర్‌షిప్ ఒప్పందం 2028 మార్చి 31 వరకు కొనసాగనుంది. ఈ కాలంలో భారత్‌లో నిర్వహించే ఒప్పంద పరిధిలోని మ్యాచ్‌లకు సంస్థ టైటిల్ స్పాన్సర్‌గా ఉంటుంది. ఈ భాగస్వామ్యం ద్వారా క్రికెట్ అభిమానులకు చేరువ కావడంతోపాటు తన వ్యాపార బ్రాండ్ గుర్తింపును మరింత పెంచుకోవాలని సంస్థ భావించే అవకాశం ఉంది.

క్రికెట్‌తో బ్రాండ్ ప్రచారానికి అవకాశం

భారత్‌లో క్రికెట్‌కు విస్తృతమైన అభిమాన వర్గం ఉంది. అంతర్జాతీయ మ్యాచ్‌ల నుంచి దేశవాళీ పోటీల వరకు ప్రేక్షకులు ఆసక్తిగా అనుసరిస్తుంటారు. ఈ నేపథ్యంలో క్రికెట్ స్పాన్సర్‌షిప్ సంస్థలకు తమ బ్రాండ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ముఖ్యమైన వేదికగా ఉపయోగపడుతుంది. మ్యాచ్‌ల ప్రసారాలు, ప్రచార కార్యక్రమాలు, ఇతర భాగస్వామ్య కార్యకలాపాల ద్వారా బ్రాండ్ గుర్తింపును పెంచుకునే అవకాశం ఉంటుంది.

ఆర్థిక వివరాలు వెల్లడికావాల్సి ఉంది

ఈ ఒప్పందానికి సంబంధించిన మొత్తం విలువ, చెల్లింపుల విధానం, ఇతర వాణిజ్య నిబంధనలపై పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. స్పాన్సర్‌షిప్ విలువ, ప్రచార హక్కుల పరిధి వంటి అంశాలు స్పష్టమైన తర్వాత ఒప్పందం వాణిజ్య ప్రాధాన్యంపై మరింత అవగాహన ఏర్పడుతుంది.

మొత్తంగా, భారత క్రికెట్‌కు ముత్తూట్ ఫిన్‌కార్ప్ టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరించనున్న ఈ ఒప్పందం సంస్థకు ప్రచార అవకాశాలను కల్పించనుంది. 2028 మార్చి 31 వరకు కొనసాగనున్న ఈ భాగస్వామ్యం భారత్‌లో జరిగే అంతర్జాతీయ, దేశవాళీ క్రికెట్ పోటీలకు వర్తించనుంది.

‘ఐ హేట్ మ్యారేజ్’ టీజర్ విడుదల..

జెన్ జీ ఆలోచనలతో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్!



నేటి తరంలో ప్రేమ, పెళ్లి, కెరీర్ మరియు స్వతంత్ర జీవనంపై యువత ఆలోచనలను ప్రతిబింబిస్తూ తెరకెక్కుతున్న యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ‘ఐ హేట్ మ్యారేజ్’. సుగి విజయ్, జ్యోస్న భద్ర జంటగా నటిస్తున్న ఈ చిత్రంతో పరమేశ్ రేణుకుంట్ల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆర్య సినిమా బ్యానర్‌పై మాదం దయానంద్, కార్తిక్ వెంపటి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ‘అప్పుడే పెళ్లా’ లిరికల్ వీడియో సాంగ్‌కు సోషల్ మీడియాలో భారీ స్పందన లభించడమే కాకుండా ట్రెండింగ్‌లో నిలిచింది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్ర యూనిట్ ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసింది.టీజర్ విడుదల సందర్భంగా దర్శకుడు పరమేశ్ రేణుకుంట్ల మాట్లాడుతూ.. “ప్రేమ, పెళ్లి, కెరీర్‌తో పాటు స్వతంత్రంగా జీవించాలనే నేటి జెన్ జెడ్ తరం ఆలోచనలు, భావజాలాన్ని వాస్తవానికి దగ్గరగా చూపించే ప్రయత్నమే ఈ చిత్రం. జీవితంలో యువత ఎదుర్కొనే భావోద్వేగాలు, నిర్ణయాలను సహజంగా ఆవిష్కరించే ప్రయత్నం ఇందులో ఉంటుంది. ప్రతి యువత ఈ సినిమాలోని పాత్రలతో కనెక్ట్ అవుతారు. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు ఇదొక చక్కటి అనుభూతిని ఇస్తుంది” అని తెలిపారు. ఈ చిత్రంలో హారిక రాజేందర్, సాహితి కృష్ణ కీలక పాత్రల్లో నటిస్తుండగా, పృథ్వీరాజ్, రవివర్మ అడ్డూరి, ప్రభావతి, ఆశ్రిత వేముగంటి, లోహిత్ కుమార్, బేబి తమోష్ణ, రాధ రాయసం, లక్ష్మి, జాకీర్, విజయ్ కుమార్, దాసరి పద్మ రేఖ, శ్రీదేవి ఆర్రోజు, మెయిల్ రమేష్, అరుణ్ కుమార్ రెడ్డి, ఇందు, అఖండ సుధాకర్ రెడ్డి తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని విజయ్ సి. కుమార్ అందించగా, సంగీతం మరియు పాటలను వరికుప్పల యాదగిరి సమకూర్చారు. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను ప్రవీణ్ ఇమ్మడి అందించగా, ఎడిటింగ్ బాధ్యతలను ఆవుల వెంకటేష్ నిర్వహించారు. ఆర్ట్ డైరెక్టర్‌గా మోహన్ జల్లా వ్యవహరించగా, అడిషనల్ డైలాగ్స్‌ను శ్రీనివాస్ తేజ అందించారు. అల్లు చాణక్య, రాజ్ కృష్ణ కొరియోగ్రఫీ అందించిన ఈ చిత్రానికి దయానంద్ మాదం, కార్తిక్ వెంపటి నిర్మాతలుగా వ్యవహరించగా, సంతోష్ రేణికుంట్ల, కాశీగారి కోదండ రామ శర్మ సహ నిర్మాతలుగా ఉన్నారు. రచన, మాటలు, స్క్రీన్‌ప్లే సమకూర్చడంతో పాటు పరమేశ్ రేణుకుంట్ల ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు.

బాలీవుడ్‌లో మరో బంపరాఫర్



దక్షిణాది యువతరంలో మంచి క్రేజ్ సంపాదించుకున్న అచ్చ తెలుగందం శ్రీలీల ఇప్పుడు హిందీలో కూడా వరుస అవకాశాలను అందిపుచ్చుకుంటున్నది. ప్రస్తుతం కార్తీక్ ఆర్యన్‌తో కలిసి అనురాగ్‌బసు దర్శకత్వంలో ఓ రొమాంటిక్ మ్యూజికల్ డ్రామాలో శ్రీలీల నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ భామ హిందీలో మరో బంపరాఫర్‌ను దక్కించుకుంది.సిద్ధార్థ్ గుప్తా ప్రధాన పాత్రలో రొమాంటిక్ థ్రిల్లర్ చిత్రం తెరకెక్కుతున్నది. దీనికి ఉమేశ్ బిష్ట్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో జాన్వీకపూర్, శ్రీలీల కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమా తొలి షెడ్యూల్ శుక్రవారం ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్‌లో ప్రారంభమైంది. ముక్కోణపు ప్రేమకథా చిత్రమిదని సమాచారం. బాలాజీ మోషన్ పిక్చర్స్ పతాకంపై ఏక్తా కపూర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బాలీవుడ్‌లో తొలి చిత్రం రిలీజ్ కాకముందే మరో భారీ ఆఫర్‌తో శ్రీలీల అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది.



ఆఫర్స్ వస్తున్నా..
కావాలనే ‘నో’ చెబుతున్నా..

సీతారామం, హాయ్ నాన్న లాంటి సూపర్ హిట్లతో జోరుమీదున్న మృణాల్ ఠాకూర్. బ్రేక్ తీసుకున్నారు. ఇండస్ట్రీలో వరుస ఆఫర్లు వస్తున్నా ఆమె కొత్త ప్రాజెక్టులకు సైన్ చేయకపోవడంపై క్లారిటీ ఇచ్చారు. ఇంతకీ మృణాల్ తీసుకున్న నిర్ణయమంటి..? హావ్ ఏ లుక్. సీతారామం సినిమాతో ఓవర్‌నైట్‌లో స్టార్‌గా మారిన మృణాల్ ఠాకూర్ తర్వాత హాయ్ నాన్న, ఫ్యామిలీ స్టార్ లాంటి సినిమాలతో బజ్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్నారు. లీసెంట్ గా అడివి శేష్ తో డెకాయిట్ సినిమాలోనూ నటించారు. డెకాయిట్ రిలీజ్ తరువాత కొత్త సినిమాకు సైన్ చేయలేదు ఈ బ్యూటీ. తాజాగా తన కొత్త ప్రాజెక్టులపై వస్తున్న కామెంట్స్ మీద స్పందించిన మృణాల్ ఇంట్రస్టింగ్ కామెంట్స్ చేశారు. పేరు కోసమో, నెంబర్ కోసమో హడావుడిగా సినిమాలు చేయడం తనకు ఇష్టం లేదన్నారు. తాను నటించే ప్రతి సినిమా అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉండాలిని, అదే టైమ్‌లో తనకు కూడా నటిగా శాటిస్ఫాక్షన్ ఇవ్వాలన్నారు. ప్రస్తుతం తన వద్దకు వస్తున్న కథలు తనకు అంతగా కనెక్ట్ కాకపోవడం వలనే కొత్త చిత్రాలకు సైన్ చేయలేదన్నారు. ఒక సినిమా కోసం సెట్స్‌లో సుదీర్ఘ కాలం గడపాల్సి ఉంటుందని, అలాంటప్పుడు పూర్తి డెడికేషన్‌తో పనిచేసేందుకు బలమైన కథాంశాలు అవసరమన్నారు. నెంబర్ గేమ్ కోసం సినిమాలు చేయనని క్వాలిటీనే ఫస్ట్ ప్రయారిటీ అని కుండబద్దలు కొట్టేశారు. భవిష్యత్తులో కూడా కేవలం తన నటనకు స్కోప్ ఉన్న పాత్రలనే ఎంచుకుంటానని క్లారిటీ ఇచ్చారు మృణాల్. తన నెక్ట్స్ సినిమాలకు సంబంధించిన ఎలాంటి అప్‌డేట్ ఉన్నా తానే అధికారికంగా వెల్లడిస్తానని, రూమర్స్‌ను నమ్మవద్దని కోరారు.

దుల్కర్ సల్మాన్ ‘ఆకాశంలో ఒక తార’ టీజర్ రిలీజ్!



యువ నటుడు దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కుతున్న సైన్స్ ఫిక్షన్/డ్రామా చిత్రం ‘ఆకాశంలో ఒక తార’ . పవన్ సాధినేని దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌ను తాజాగా మేకర్స్ విడుదల చేశారు. చదువంటే ఇష్టమున్న ఒక అమ్మాయి పల్లెటూరి నేల నుంచి మొదలై ఏకంగా అంతరిక్షం వరకు సాగే ఒక అద్భుతమైన భావోద్వేగ ప్రయాణంగా ఈ టీజర్ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది.ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్ సరసన సాత్విక నటిస్తుండగా, శృతి హాసన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ అందిస్తున్న సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. విభిన్నమైన కథాంశంతో, అద్భుతమైన విజువల్స్ తో రూపొందుతున్న ఈ టీజర్ సినిమాపై భారీ అంచనాలను పెంచేసింది.

కత్తి పట్టిన సీతగా సాయి పల్లవి..

అదరగొడుతున్న ‘రామాయణం’ కొత్త ప్రోమో!



నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక పాన్-ఇండియా చిత్రం ‘రామాయణం’ తాలూకు కొత్త ప్రోమో ప్రస్తుతం సినిమా వర్గాల్లో, సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇందులో సీతాదేవిగా నటిస్తున్న సాయి పల్లవి చేతిలో కత్తితో యోధురాలి రూపంలో కనిపించిన విజువల్స్ అందరినీ విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. సాధారణంగా సినిమాలలో సీతాదేవి పాత్రను కేవలం బాధ్యతాయుతమైన భార్యగా మాత్రమే చూపించడం ఆనవాయితీగా వస్తుండగా, ఈ చిత్రంలో ఆమెలోని ధైర్యసాహసాలు, యోధురాలి కోణాన్ని ఆవిష్కరించేలా మేకర్స్ ఈ ప్రోమోను రూపొందించారు.ఈ విజువల్ వండర్ సినిమాకు సంబంధించిన ఈ కొత్త ప్రోమో సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. రణబీర్ కపూర్ రాముడిగా, యష్ రావణాసురుడిగా, సాయి పల్లవి సీతాదేవిగా నటిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మర్ సంగీతం అందిస్తున్నారు. నవంబర్ 5న దీపావళి కానుకగా ఈ చిత్ర మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

డేంజర్ జోన్‌లో మిల్కీ బ్యూటీ కెరీర్..

-అది తప్ప మరో ఆప్షన్ కనిపించట్లేదా..?

తన కెరీర్‌ను కాపాడుకోవాలంటే బోల్డ్ స్టెప్ తీసుకోక తప్పదని మిల్కీ బ్యూటీ తమన్నా గట్టిగా డిసైడ్ అయిపోయారా..? అందుకే తన 18 ఏళ్ళ ప్రయాణంలో ఎన్నడూ లేనంతగా వరుసపెట్టి బోల్డ్ సినిమాలను ఓకే చేస్తున్నారా..? రాగిణి ఎంఎంఎస్ 3 సినిమానే ఎక్స్‌ట్రీమ్ అనుకుంటే.. దాన్ని మించిన మరో డర్టీ పిక్చర్‌లో తమన్నా నటించబోతున్నారా..? అసలు మిల్కీ బ్యూటీ ప్లాన్ ఏంటి..? ఇండస్ట్రీకి వచ్చాక దాదాపు 18 ఏళ్ళ పాటు నో కిస్సింగ్ పాలసీ ఫాలో అయ్యారు తమన్నా. కానీ తన రూట్ పూర్తిగా మార్చేశారిప్పుడు. ఆ మధ్య వచ్చిన లస్ట్ స్టోరీస్ 2 వెబ్ సిరీస్‌లో పాత రూల్స్ అన్నీ పక్కనపెట్టి లిప్‌లాక్ సీన్స్‌తో పాటు ఇంటిమేట్ సీన్స్‌లో నటించి అందరికీ షాక్ ఇచ్చారు. అదే బాటలో వెళ్తూ రాగిణి ఎంఎంఎస్ 3 లాంటి పక్కా బోల్డ్ అండ్ హారర్ సినిమాలో నటిస్తున్నారు. రాగిణి ఎంఎంఎస్ ఫ్రాంచైజీలోనే ఇంటిమేట్ సీన్స్‌కు ఏమాత్రం కొదవ ఉండదు.. పార్ట్ 3లోనూ తమన్నా గ్లామరస్‌గా కనిపించబోతున్నారని తెలుస్తుంది. ఇది సెట్స్‌పై ఉండగానే ది డర్టీ పిక్చర్ 2లోనూ హీరోయిన్‌గా తమన్నాని తీసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. విశేషం ఏంటంటే ఈ రెండు బోల్డ్ ప్రాజెక్టులను నిర్మిస్తున్నది ఏక్తా కపూరే. మొత్తానికి కెరీర్‌లో ఖాళీ అనే పదమే లేకుండా ఎలాగోలా బిజీగా ఉండటమే లక్ష్యంగా మిల్కీ బ్యూటీ అడుగులేస్తున్నారు. కుదిరితే హీరోయిన్ ఆఫర్స్, లేదంటే క్రేజీ స్పెషల్ సాంగ్స్, అదీ కాకపోతే ఓటీటీ వెబ్ సిరీస్‌లు, ఇవేవీ కాదంటే ఇలాంటి బోల్డ్ సినిమాలు చేస్తూ దూసుకుపోతున్నారు. ఏదేమైనా 35 దాటాక తమన్నా గేర్ మార్చి వరుస ఆఫర్లతో ఇండస్ట్రీని షేక్ చేస్తుండటం విశేషం.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com